

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States



CORPORATE COMMERCE™
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios


CA. China Masthan T
www.corporatecommerce.in
94188 66666



సంపుటి : 24 | సంచిక : 27 | ది. 25-3-2025 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# సాయం అందించే చేతులకు వేదిక పీ4

- సంపన్నులు - పేదలను ఒకేచోటకు చేర్చడమే లక్ష్యం
- ఎన్నారైలతో సహా స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకురావొచ్చు
- అండగా నిలిచేవారు 'మార్గదర్శి' - లబ్ధి పొందేది 'బంగారు కుటుంబం'
- మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- 2029 కల్లా పేదరికాన్ని నిర్మూలించాలనేది సంకల్పం
- ఉగాది రోజున అమరావతిలో పీ4 ప్రారంభం
- పీ4 విధానానికి తుదిరూపు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి, మార్చి 24 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో సంపన్నవర్గాల వారు పేదలకు సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం పీ4 విధానం ద్వారా ప్లాట్‌ఫామ్ నిర్మిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉగాది రోజున ప్రారంభించే జీరో పావర్టీ %-% పీ4 విధానంపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సాయం అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చని, ఎవరినీ ఇందుకోసం ఒత్తిడి చేయొద్దని అధికారులకు సూచించారు. ఎన్నారైలు కూడా పీ4లో భాగస్వాములు కావొచ్చని...గతంలో తన హయాంలో చేపట్టిన జన్మభూమి తరహాలోనే పీ4 కార్యక్రమానికి కూడా ప్రజాదరణ వస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. పీ4 విధానంలో ప్రభుత్వ పాత్ర కేవలం ఇరువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమేనని, ప్రభుత్వం తరపున ఎవరికీ అదనపు సాయం ఉండదని చెప్పారు. ఉన్నతవర్గాల వాళ్లు సాయానికి ముందుకొచ్చేలా వారిలో స్ఫూర్తి నింపాలని ముఖ్యమంత్రి అన్నారు. లబ్ధి పొందేవారిని 'బంగారు కుటుంబం'గా, సాయం చేసే వారిని 'మార్గదర్శి'గా పిలవాలని సూచించారు. బంగారు కుటుంబానికి ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని చెప్పారు. గ్రామసభ, వార్డు సభలు నిర్వహించడం ద్వారా తుది జాబితా రూపొందిస్తే వివాదరహితంగా ఉంటుందని అన్నారు. పీ4 కార్యక్రమానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న పథకాల అమలుకు ఎటువంటి సంబంధం లేదని సీఎం అన్నారు. పీ4 కార్యక్రమం అనేది సమాజంలో అత్యంత వెనకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు చేపట్టిన కార్యక్రమం అని అన్నారు. పీ4, ప్రభుత్వ పథకాల అమలుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు అధికారులు తావివ్వకూడదని తెలిపారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒకరైనా హాజరయ్యేలా, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పేదరిక నిర్మూలన - జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యం చేరే వరకు పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది.

# డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయండి

- ప్రజలకు మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకెళ్లండి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశం




**అమరావతి,మార్చి 24 (వార్తాప్రభ) :** ఆర్టీజీఎస్‌లో చేపడుతున్న డేటా అనుసంధాన ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. ఆర్టీజీఎస్ కార్యకలాపాలైన సోమవారం ఆర్టీజీఎస్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. డేటా అనుసంధానంతో ఏర్పాటు చేస్తున్న డేటా లేక్ పనుల ప్రగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేటా అనుసంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా డేటా అందివ్వని శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి వారి నుంచి కూడా సాధ్యమైనంత త్వరగా డేటా తెప్పించి డేటా లేక్ పనులు వేగవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించేలా డేటా లేక్ ఏర్పాటు పనులు చేపట్టాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ అమలు ప్రగతిపైన కూడా సీఎస్ సమీక్షించారు. వాట్సాప్ ద్వారా 200కుపైగా సేవలందించడం శుభపరిణామన్నారు. ప్రజలకు మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకెళ్లాలని, ప్రజలు సులభంగా ప్రభుత్వం నుంచి అన్ని సేవలను వాట్సాప్ ద్వారా పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకునేవారి సంఖ్య ఇంకా పెరగాలని, పౌరులందరూ ఈ సేవలు ఉపయోగించుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో పౌరులు తమ వాయిస్ మెసేజ్ ద్వారా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు పొందే సదుపాయాన్ని కూడా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది యంత్రాంగం పనితీరు మరింత పెంపొందించేలా ఈ-ఫైళ్ల క్లియరెన్సును మదింపు వేయాలన్నారు. ఐటీ మరియు రియల్ టైం గవర్నెన్స్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతి గురించి సీఎస్‌కు వివరించారు. పౌరులు వాట్సాప్ ద్వారా కేవలం టెక్ట్స్ మెజేజ్ ద్వారానే కాకుండా తమ వాయిస్ మెసేజ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు సౌలభ్యంతో సులభంగా అన్ని సేవలు పొందేలా వాట్సాప్ గవర్నెన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ప్రస్తుతం ఇది పరీక్ష దశలో ఉందని, త్వరలోనే దీన్ని పౌరులందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. వాయిస్ ద్వారా పౌరులు ప్రభుత్వం నుంచి తాము ఎలాంటి సేవ కోరుతున్నారో అడిగితే ఏఐ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆ సేవ పొందే చోటుకు ఆటోమేటిక్‌గా తీసుకెళ్లే సదపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. డేటా అనుసంధాన ప్రక్రియ కూడా వేగవంతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి ప్రభుత్వ శాఖలో ఒక చీఫ్ డేటా టెక్నికల్ ఆఫీసర్ (సీడీటీఓ)ను నియమించడం జరిగిందన్నారు. దాదాపుగా అన్ని శాఖలు డేటా లేక్‌తో అనుసంధానం అవుతున్నాయని, కొన్ని శాఖల నుంచి ఇంకా డేటా రావాల్సి ఉందని వాటిపైన ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి ప్రజలకు, రైతులకు వాతావరణం గురించి క్షుణ్ణంగా వివరాలు ఎప్పటికప్పుడు అందించేలా ఆర్టీజీఎస్‌లో ఆవేర్ (ఆంధ్రప్రదేశ్ వెతర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చ్ సెంటర్) హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో జీఏడీ పొలిటికల్ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాంషు శుక్లా, ఎక్సైజు శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య ఆర్టీజీఎస్ ఇన్ ఛార్జి సీఈఓ ఎం. మాధురీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎన్డీఏ కూటమి

- మారుతున్న రాజకీయ సమీకరణలు
- దక్షిణ తెలంగాణలో ఇప్పటికీ బలంగా ఉన్న తెలుగుదేశం..!
- ఇండియా కూటమిలో చేరిక కేసీఆర్‌కు తప్పదా...?




**హైదరాబాద్, మార్చి 24 (వార్తాప్రభ) :** తెలంగాణలో అధికార కాంగ్రెస్ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇబ్బందులు లేకుండా ముందుకు పోతున్నా ఆయనకు పార్టీలో సరైన సహకారం లేదనే విషయం భహిరంగ రహస్యమే. అయితే ఎన్ని ఇబ్బందులు ఉన్నా మొండిగా,ధైర్యంగా ముందుకుపోయి అనుకున్నది సాధించడం రేవంత్‌రెడ్డి ప్రత్యేకతగా చెప్పవచ్చు. అధికార పార్టీలో పాత తరం సీనియర్ నాయకులను కలుపుకుంటూ, మరోవైపు ప్రజోపయోగకరమైన పథకాలను అమలు చేస్తూ, అదిష్టానానికి ఎప్పటికపుడు నివేదికలు అందిస్తూ ముందుకు పోతున్నారు . అయితే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు రేవంత్ సర్కార్‌పై ప్రతినిత్యం విరుచుకు పడుతూనే ఉన్నారు. అక్కడున్న వాగ్ధాటి గల నేతలు రేవంత్‌కు అంతగా అండగా లేరనే చెప్పాలి. ఒక వైపు బీఆర్ఎస్ నుండి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితలతో పాటు పార్టీ నాయకులు, మరోవైపు బీజేపీ నుండి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, అర్వింద్, రఘునందనరావు లాంటి నేతలు నిద్రలేచిన దగ్గర నుంచి దుమ్మెత్తిపోస్తూనేఉన్నారు. హామీల అమలు విషయంలో రేవంత్ రెడ్డి ఎదురీదుతున్నా చాలావరకు అమలు చేస్తూనే ఉన్నాడు. కేంద్ర నుండి ఆశించినంత సాయం లేకపోయినా ,ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా సంక్షేమం విషయంలో మాత్రం రేవంత్ వెనకడుగువేయడం లేదు.బీఆర్ ఎస్ నేతలు చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపుతూ రేవంత్‌ను ఇరుకున పెడ్డడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే ఎన్నికలలో పోటీ చేయకుండా వ్యూహాత్మకంగా బీఆర్ ఎస్ ఉండిపోవడంతో ఈ పరిణామం బీజేపీకి ప్లస్‌గా మారుతోంది.ఎంఎల్సీ ఎన్నికలలో ఈ విషయం రూఢీ అయింది. అధికార కాంగ్రెస్ ఎంత పోరాడినా మూడింటికి రెండు స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంది.మరో స్థానం ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించాడు.

> **తె**లంగాణా.. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ళకు పైగా ఉన్నా ఇప్పటినుంచే ప్రధాన రాజకీయ పక్షాలు కత్తులు నూరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికలలో తమదే అధికారం అంటూ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి తెలంగాణాలో రాజకీయ పరిస్థితులు, పార్టీల బలాబలాలను విశ్లేషిస్తే....

**తెలంగాణలో ఎన్డీఏ కూటమి :** తెలంగాణలో ఎన్డీఏ కూటమి ఏర్పాటు చేయడానికి చాపకింద నీరులా ప్రయత్నాలు చకచకా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ,టీడీపీ,జనసేన కూటమి విజయదుంధుభి మోగించిన నేపథ్యంలో తెలంగాణాలో కూడా అదే మూడ్ క్రియేట్ చేయడానికి ఉమ్మడి నాయకులు వ్యూహాలు రచిస్తున్నారు. బీజేపీకి ఇపుడు దేశంలో నమ్మకమైన మిత్రుడుగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మారిన నేపథ్యంలో బీజేపీ అధినాయకత్వం కూడా తెలుగుదేశంతో పొత్తుకు ఇక్కడ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఒకపుడు తెలంగాణాలో బలీయంగా ఉన్న తెలుగుదేశం రాను రాను పేరొందిన నాయకులందరూ వెళ్ళిపోవడంతో చాలావరకు బలహీనపడిన మాట వాస్తవం. అయితే నాయకులు లేకున్నా కార్యకర్తలు మాత్రం తెలుగుదేశం పార్టీనే ఇప్పటికీ అంటిపెట్టుకుని ఉండడం ఆ పార్టీకి పునాది ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు దక్షిణ తెలంగాణాలో కూడా తెలుగుదేశం పార్టీకి బలమైన క్యాడరే ఉందని చెప్పవచ్చు. అయితే ముందుండి వారిని నడిపించే బలమైన నాయకులే లేకపోవడం ఆ పార్టీకి ఇక్కడ మైనస్‌గా మారింది. దీంతో తెలుగుదేశం అధినేత చంద్రబాబు తెంగాణాలో పార్టీ పునర్వైభవానికి ఓ వ్యూహం రచించినట్లు తెలంగాణ సీనియర్ నేతలు ఇకరు వ్యాఖ్యానించారు. చాలావరకు బీఆర్ ఎస్, కాంగ్రెస్‌లలో పాత తెలుగుదేశం నాయకులే ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ ఎస్‌లో అయితే తొంభైశాతం వరకు తెలుగుదేశం బ్రాండ్ నేతలే ఉన్నారు. బీఆర్ ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడంతో, సెకండ్ క్యాడర్ స్తబ్దుగా ఉండడంతో బీఆర్ ఎస్ నాయకులలో అంతర్మధనం ప్రారంబమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మళ్ళీ బలపడడానికి తెలుగుదేశం అంతర్గతంగా ప్రయత్నాలు ప్రారంభించిందని నగరానికి చెందిన ఓ బీఆర్ ఎస్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. బలమైన కూటమిగా ఏర్పడితే బీఆర్ ఎస్‌లోని తెలుగుదేశం సానుభూతి పరులు మళ్ళీ స్వంత గూటికి వచ్చే అవకాశాలున్నాయనే ఆలోచన టీడీపీ నాయకత్వం చేస్తుంది. ఈ పరిణామాలను ముందుగా పసిగట్టిన కేసీఆర్ చంద్రబాబు నాయుడుపై అవకాశం వచ్చినపుడల్లా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే ఎన్డీ నాయకులు మాత్రం ఈ పొత్తు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీకి చెందిన ఓ సీనియర్ నేత అంతర్గత సంభాషణలలో చెప్పిన సమాచారం ప్రకారం.. ముందుగా ఎన్డీఏ కూటమీ వచ్చే బల్దియా (గ్రేటర్ హైదరాబాద్) ఎన్నికలలో కలసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ ట్రైలర్ కనుక సక్సెస్ అయితే పూర్తిస్థాయిలో తెలంగాణలో కూటమిగా ఏర్పడవచ్చనే అభిప్రాయం అధి నాయకత్వాలు అంచనా వేస్తున్నట్లు సమాచారం...

**బీఆర్ ఎస్ పయనం ఎటు :**

తెలంగాణలో బలీయమైన శక్తిగా ఉన్న బీఆర్ ఎస్ ఇపుడు చౌరస్తాలో నిలబడిందని చెప్పవచ్చు. ఒక వైపు ఎమ్మెల్యేల పార్టీ మార్పు వ్యవహారంతో పాటు క్యాడర్‌ను కాపాడుకోవడం వారికి అగ్నపరీక్షగా మారుతోంది. గత పార్లమెంట్ ఎన్నికలలో తమ స్థానాన్ని బీజేపీ ఆక్రమించుకోవడం బీఆర్ ఎస్ క్యాడర్‌కు మింగుడు పడడం లేదు. బీజేపీతో పొత్తుకు ప్రయత్నించినా ఆశించిన విధంగా సానుకూల స్పందన రాలేదని జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే అర్థమవుతోంది. భవిష్యత్‌లో తెలంగాణాలో కూడా ఎన్డీఏ కూటమి,ఇండియా కూటమిగా వైరి వర్గాలుగా ఏర్పడవచ్చనే అభిప్రపాయం క్రమంగా బలపడుతూ వస్తుంది. ఈ సమయంలో డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతందనే విషయమై తమిళనాడు సీయం స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశానికి సీయం రేవంత్ అటు బీఆర్ ఎస్ నుండి కేటీ ఆర్ హాజరయ్యారు. తెలంగాణాలో వైరి వర్గాలుగా నిత్యం కత్తులు దూసుకుంటున్న పార్టీలు ఈ విషయంలో మాత్రం ఒకే వేదికపై ఏకాభిప్రాయంతో మాట్లాడారు. కేసీఆర్ ఇండియా కూటమి వైపు వెళ్ళే సూచనలే ఎక్కువగా కనబడుతున్నాయని సీనియర్ రాజకీయ విశ్లేషకులు ఒకరు వ్యాఖ్యానించారు. ఏదిఏమైనా రానున్న రోజుల్లో సమీకరణలు ఎటు అయినా మారవచ్చని...అయితే అన్ని పార్టీల నాయకులు అధికారమే లక్ష్యంగా తమ పావులు కదుపుతూ అడుగులు వేస్తున్నారనేది భహిరంగ రహస్యమే.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది... మార్కెట్ ఏం లేదు..



**హైదరాబాద్,మార్చి 24 (వార్తాప్రభ) :** మనదేశంలో స్థిరాస్తి వ్యాపారంలో ముంబై, ఢిల్లీ, బెంగళూరు, నాగ్ పూర్, లక్నో వంటి నగరాలు ముందు వరుసలో ఉంటాయి. ఈ ప్రాంతాలలో భారీగా స్థిరాస్తి వ్యాపారం జరుగుతూ ఉంటుంది. దేశం మొత్తంలో ఇక్కడే ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉంటుంది. అయితే ఈ నగరాలలో ముంబై తరహాలో హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతూ ఉంటుంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడం.. హైదరాబాదులో బహుళ కంపెనీలు ఏర్పాటు కావడంతో రియల్ ఎస్టేట్ గత కొన్ని సంవత్సరాలుగా అంచనాలకు మించి ఎదుగుతోంది. ఇదే సమయంలో వర్షాలు వచ్చినప్పుడు హైదరాబాద్ నగరంలో అనేక కాలనీలు నీట మునిగిపోతున్నాయి. రోడ్లు మొత్తం జలమయం అవుతున్నాయి. భూములకు ధర విపరీతంగా పెరగడంతో హైదరాబాద్ నగరంలో ఉన్న చెరువులు మొత్తం కబ్జాకు గురయ్యాయి. నాలాలు నామరూపాలను కోల్పోయాయి. దీంతో హైదరాబాద్ నగరంలో వర్షాలు వస్తే చాలు కాలనీలకు కాలనీలు నీట మునిగిపోతున్నాయి. అయితే ఈ పరిస్థితిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చింది. అంతేకాదు ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పారిన మూసీ నదిని ప్రక్షాళన చేయాలని భావించింది. దీనికి భారీగా నిధులు కేటాయించింది. హైడ్రా ఆక్రమణకు గురైన చెరువులను సంరక్షించే బాధ్యతను భుజాలకు ఎత్తుకుంది. ఇందులో కొన్ని ఆరోపణలు వినిపించినప్పటికీ.. హైడ్రా ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. చెరువుల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేస్తోంది. కొన్ని విషయాలలో హైడ్రా వ్యవహరిస్తున్న తీరు ఆరోపణలకు కారణమవుతున్నప్పటికీ.. ప్రభుత్వం ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. హైడ్రాకు ఇంకా మరిన్ని అధికారాలు కట్టబట్టే ప్రయత్నం చేస్తోంది.

**రియల్ ఎస్టేట్ కుప్ప కూలిందట..?**

హైడ్రా వల్ల హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని.. ఇప్పట్లో పుంజుకునే అవకాశం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటిదాకా ఇలాంటి ఆరోపణలు భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ మాత్రమే చేశాయి. అయితే తొలిసారిగా ఎంఐఎం కూడా ఈ పల్లవి అందుకుంది. ఎంఐఎం ఎమ్మెల్యే అసదుద్దీన్ ఓవైసీ శాసనసభ వేదికగా ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చారు. దీనివల్ల ఆక్రమణలు తొలగింపు మాట ఏమిటో గాని.. హైదరాబాద్ లోని రియల్ ఎస్టేట్ మొత్తం కుప్పకూలిపోయింది. ఇప్పట్లో తిరిగి లేచే అవకాశం లేదు. మూసి ప్రక్షాళనను విషయాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దానిని ఎప్పుడు బాగు చేస్తారో తెలియదు. హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉండేది. ఇప్పుడు మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రానే. పరిస్థితి ఇలానే కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి ఆదాయం పూర్తిగా తగ్గుతుంది. అప్పుడు పథకాలకు.. ఇతర వాటికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో ప్రభుత్వానికి తెలియాలని" అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యానించారు. అయితే అసదుద్దీన్ చేసిన వ్యాఖ్యలను భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా విభాగం తెగ ప్రచారం చేస్తోంది. అయితే ఆసదుద్దీన్ కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఫాతిమా కాలేజీని చెరువులో నిర్మించారని.. దానిని పడగొట్టేందుకు హైడ్రా ప్రయత్నిస్తుండగా.. ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరం వరకే ఫాతిమా కాలేజీకి అనుమతి ఇవ్వడం.. తదుపరి విద్యా సంవత్సరంలో దానిని పడగొడతారని తెలుస్తోంది.

**IN THE COURT OF VII ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**
I.A.No.1144/2024
IN
O.S.No.782/2016

BETWEEN:
Banda Girija Kumari
And Others
--------Petitioners
Versus
Banda Padma Latha
And Others
-------- Respondents

To:
Dodla Mounica, D/o Raja Rao, R/o D.No.6-19-17/A, Gunnabattula Achaiah Street, Kothapet, Vijayawada, Krishna District.

WHEREAS the above named Petitioners has filed I.A. No.1144/2024 impleading you as a party in the above suit. You are hereby either appear in person or appear through an Advocate on 28-03-2025 at 10.30 A.M in the above court, failing which you will be set exparte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)

**Smt. Kilaru Sarala Benarjee**
**Advocate,**
**Vijayawada**

**CERTIFICATES MISSING**

I have lost my original Consolidated grade card and Provisional degree certificate of M.tech degree of NIT Calicut with Registration No: M180 CE450 in Eluru town. If found please contact
**Hemanth Vucha**
**9491594787**

**గ్రామ పంచాయితీ కార్యాలయం - చౌటపల్లి**
**టెండర్ ప్రకటన**

తేది : 24-03-2025

ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, చౌటపల్లి గ్రామ పంచాయితీ 2025-2026 సంవత్సరమునకు గ్రామ పంచాయితీ ఏరియాలో ఈ దిగువ వివరించిన పనులు చేయుటకు రేట్ కాంట్రాక్టు పద్ధతిపై 3 (ముగ్గురు) వ్యక్తుల సేవలు వినియోగించుకొనుటకు 3 (ముగ్గురు) వ్యక్తుల సప్లయి కొరుతూ 28-03-2025 వ తేదీ ఉదయం 11 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు ఆఫీస్ పనివేళ అందు తెలుసుకొనగలరు.

| వ.నెం | పని వివరములు | టెండర్ కాలము | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | గ్రామ పంచాయితీ ఏరియాలో పారిశుధ్య పనులు నిర్వహించుటకు -1 (ఒకరు) వ్యక్తుల సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు (ఒక సంవత్సర కాలము) | రూ. 1000/- |
| 2) | గ్రామ పంచాయితీ వీధి దీపములు రిపేరు పనులు నిర్వహించుటకు -1 (ఒకరు) వ్యక్తుల సేవలు | - Do - | రూ. 1000/- |
| 3) | గ్రామ పంచాయితీ ఏరియాలో మంచినీటి ట్యాంకు ఆపరేటర్ పనులు నిర్వహించుటకు -1 (ఒకరు) వ్యక్తుల సేవలు | - Do - | రూ. 1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. గ్రామ పంచాయితీ నిధుల లభ్యత బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- పి.పుల్లయ్య
సర్పంచ్
గ్రామ పంచాయితీ, చౌటపల్లి

సం/- ఎం.వెంకటేశ్వరరావు
కార్యదర్శి
గ్రామ పంచాయితీ, చౌటపల్లి

# అమరావతిలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ!

- జార్జియా నేషనల్ యూనివర్సిటీ ఒప్పందం
- రూ.1,300 కోట్లు పెట్టుబడి పెట్టనున్న జీఎన్ యూ
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ




**అమరావతి,మార్చి 24 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో అమరావతిలో ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో జీఎన్ యు, ఎపి ప్రభుత్వ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం అమరావతిలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్థాపించడానికి జి ఎన్ యు సుమారు రూ. 1,300 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ఈ ఒప్పందంతో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందడంతోపాటు 500మందికి ఉపాధి లభిస్తుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ స్థాపనకు మద్దతుగా పెట్టుబడి, సాంకేతికత, ప్రణాళిక రూపకల్పన, ఎక్విప్ మెంట్ లలో జి ఎన్ యు బలాలను ఉపయోగించుకోవడం ఈ సహకారం లక్ష్యం. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జార్జియన్ నేషనల్ యూనివర్సిటీతో ఈ ఒప్పందం మన విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడంతోపాటు ఏపీ విద్యారంగాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు దోహదపడుతుందని అన్నారు. ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను పెంచడమే కాకుండా ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. ఏపీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న మా ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు ఈ ఒప్పందం నిదర్శనమని అన్నారు.

## ఠాగూర్ గ్రంథాలయానికి 15,000 విలువ చేసే వస్తువులు అందజేత..



విజయవాడ సెంట్రల్, మార్చి 24 (వార్తాప్రభ) : ఈరోజు విజయవాడలో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి ఆఫీసు నందు ఉపయోగించుకొనుటకు గోద్రెజ్ ఐరన్ సేఫ్ మరియు కార్యాలయ అవసరార్థం ఆఫీస్ టేబుల్ ను మరియు మంచినీళ్ళ టాప్ నకు వాటర్ ట్యాంకునకు ఎక్కించుటకు ఉపయోగపడు లక్ష్మి కంపెనీ మోటర్ ను పేర్లు తెలియజేయుటకు సముఖత చూపని దాతలు సుమారుగా 15 వేల రూపాయల సొమ్ముతో పైన పేర్కొన్న వస్తువులను విరాళంగా అందించడమైనది. ఠాగూర్ గ్రంథాలయానికి ఉపయోగపడు వస్తువులను బహుమతిగా ఇచ్చిన దాతలను గ్రంథాలయ అధికారిని కే రమాదేవి మరియు సిబ్బంది జి ఉమా రాణి, రమేష్ , ధనలక్ష్మి, రాంబాబు మరియు కుమార్ లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడమైనది.

## భారత స్వాతంత్ర్య సంగ్రామంలో దొమ్మేటి కృషి మరువలేనిది

● శెట్టిబలిజల ఆరాధ్య దైవం "దొమ్మేటి వెంకటరెడ్డి ● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



రామచంద్రపురం/కాజులూరు,మార్చి 24 (వార్తాప్రభ) : ప్రముఖ సంఘ సంస్కర్త, నిరక్షరాస్యత నిర్మూలనకు ఎనలేని సేవలు అందించిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టి బలిజలకు ఆరాధ్య దైవంగా కొనియాడ బడుతున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామంలో శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి 172 వ జన్మదినం సందర్భంగా జరిగిన వేడుకలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మంత్రి సుభాష్ దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో జాతీయోద్ధరణకు దొమ్మేటి వెంకటరెడ్డి విశేష కృషి చేశారన్నారు. ముఖ్యంగా చదువు ఆవశ్యకతను దూరదృష్టితో ఆలోచించి వయోజన విద్యను ప్రోత్సహించడంతో పాటు, ఎన్నో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు,రాత్రి పాఠశాలలు నెలకొల్పారని కొనియాడారు. చదువుతోనే సమానత్వం,ఆర్థిక పరిపుష్టి,జ్ఞాన సముపార్జన సాధ్యమని విద్యకు ప్రాధాన్యత ఇచ్చి,ఎన్నో పుస్తకాలు వ్రాశారన్నారు. కులాధిక్యత, అంటరానితనం ఎక్కువగా ఉన్న ఆ రోజుల్లో మనుషులంతా సమానమే అనే నినాదంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా బర్మాలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం స్థాపించి, వారి అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. అనంతరం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,శెట్టిబలిజ సంఘాల పెద్దలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలి




కాకినాడ,మార్చి 24 (వార్తాప్రభ) : మత్తుపదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డా.వరప్రసాద్ పేర్కొన్నారు. రంగారాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.డీఎస్వీఎల్ నరసింహం ఆదేశానుసారం డిఎఫ్ఏపీ నోడల్ అధికారి, మానసిక వైద్యులు డా.వర ప్రసాద్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు వ్యతిరేక అవగాహనా ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డా.శశి ప్రారంభించగా 300 కు పైగా రంగరాయ వైద్య మరియు నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు కళాశాల ప్రాంగణం నుంచి ర్యాలీగా బయలు దేరి వివిధ అవగాహనా నినాదాలు ప్రదర్శిస్తూ భానుగుడి జంక్షన్ కు చేరుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. సౌమ్య మరియు నర్సింగ్ కాలేజీ అధ్యాపకురాలు మాధవి పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కాలేజీ కూడా మత్తు పదార్థాలవినియోగానికి దూరంగా ఉండాలన్నారు ప్రతి విద్యార్థి కూడా ప్రజలకి అవగాహన కలిగించే విధంగా ఉండాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని డా. వర ప్రసాద్ తెలియచేశారు.

## భక్తుల తో కిటకిట లాడిన తిరుపతమ్మ ఆలయం



పెనుగంచిప్రోలు,మార్చి 24 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ గోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మ వారీ ఆలయం కు శనివారం రాత్రి నుండే వివిధ వాహనాలల్లో భక్తులు చేరుకున్నారు.ఆదివారం తెల్లవారు జామూనే మునేటి లో తల స్నానాలు ఆచరించి పాల పొంగల్లు పొంగించుకొని పిల్లాపాపలతో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని దర్శించు కొన్ని వారి మొక్కులు తీర్చు కొన్నారు ఆదివారం కావడం తో భక్తులు వేల సంఖ్య లో అమ్మవారిని దర్శించు కున్నారు, భక్తులతో ఆలయం కిటకిట లాడింది. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి. భూపతి రాజు సత్య నాగ కిశోర్ కుమార్, చైర్మన్ జంగాల. శ్రీనివాసరరావు లు ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు.

## రొమ్ము కేన్సర్, శస్త్రచికిత్స పై వైద్య విద్యార్థులకు బోధన




కాకినాడ,మార్చి 24 (వార్తాప్రభ) : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగం నందు రొమ్ముకు సంబంధించిన వ్యాధులు,రొమ్ము క్యాన్సర్ శస్త్ర చికిత్స (ఆపరేషన్లు) ప్రత్యక్ష ప్రసారంలో వైద్య విద్యార్థులకు బోధించారు. ఈ వర్కు షాపు నందు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల రాజమండ్రి ,అమలాపురం,విశాఖపట్నం మ,శ్రీకాకుళం వైద్య కళాశాల నుంచి విద్యార్థులు,డాక్టర్లు పాల్గొన్నారు. ఈ వర్క్ షాపునకు డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు శాస్త్ర చికిత్స విభాగపు అధిపతి అధ్యక్షతన డాక్టర్ ఏ.కిషోర్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ వర్కు షాప్ నకు ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్,ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ డాక్టర్ డి .ఎస్. వి. ఎల్.నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి డా.విష్ణువర్ధన,డా.విఠల్ డా.కే. బాబ్జి ,డా.పి.వి.బుద్ధ, డాక్టర్.రవి కమల్ ,డాక్టర్ వెంకటరెడ్డి,ప్రసిద్ధ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ సౌమ్య అపోలో హాస్పిటల్ హైదరాబాద్ డాక్టర్ ప్రశోబ మెడికవర్ హాస్పిటల్, కాకినాడ డాక్టర్ నరేంద్ర ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడ మొదలగువారు శస్త్ర చికిత్స చేసి చూపించినారు. దీని వలన క్యాన్సర్ శాస్త్ర చికిత్సకు సంబంధించిన ఎన్నో మెళుకువలు విద్యార్థులు నేర్చుకున్నారు. ఈ వర్కుషాపు నందు డా.శైలజ రాణి,డా.శివ రామకృష్ణ,డా.మైథిలిదేవి ,డా.శైలజమొదలగు వైద్యనిపుణులు పాల్గొన్నారు. ఈ రకమైన వర్కు షాపులు వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని,ఇలాంటివి నిర్వహించడం వలన వైద్య విద్యా ప్రమాణాలను పెంచ వచ్చని ఈ సందర్భంగా డాక్టర్ డి.ఎస్.వి.య ఎల్. నరసింహం అన్నారు.

## ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



అమలాపురం,మార్చి 24 (వార్తాప్రభ) : ప్రభుత్వం అక్రమ విద్యుత్ వసూళ్లను వెంటనే ఆపాలని,ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, అల్లవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సోమవారం ఆక్వా రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా ఎక్స్పోర్టర్స్ నియంతృత్వ ధోరణి నశించాలని,రొయ్యలకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అలాగే రొయ్యల మేత తయారీకి వాడే ముడి సరుకుల రేట్లు తగ్గినప్పటికీ రొయ్యల మేతల ధరలు తగ్గించలేదని వాపోయారు. తక్కువ లోడు విద్యుత్తు వల్ల ఆక్వా రంగం నష్టాలకు విద్యుత్ శాఖ కారణంగా నిలుస్తుందన్నారు. తక్షణమే నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆయన డిమాండు చేశారు. ముందుగా అమలాపురం పట్టణం క్షత్రియ కళ్యాణమండపంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులు సోమవారం సమావేశమైన అనంతరం జిల్లా కలెక్టరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఆక్వా రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు యాళ్ళ వెంకటానందం, చవటపల్లి నాగభూషణం,వేగిరాజు వెంకటరాజు,రుద్రరాజు నాని రాజు,చవటపల్లి శ్రీను,గుమ్మల్ల సురేష్. సత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## వైకాపా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టిడిపి నేత చింతల



పెనుగంచిప్రోలు,మార్చి 24 (వార్తాప్రభ) : పెనుగంచిప్రోలు వైకాపా నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం తెలుగు దేశం పార్టీ నాయకుల పై నిందలు వేస్తున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య అన్నారు. అమ్మవారి ఉత్సవంలో జరిగిన అరెస్టులకు తెదేపా నాయకులకు సంబంధం లేదని ఆయన తెలిపారు. ఆయన విలేకరుల తో మాట్లాడుతూ అమ్మవారి సాక్షిగా చెబుతున్నాను ఎవరిపైన కంప్లైంట్ ఇవ్వలేదు, ఎవరి పేర్లు కూడా మేము చెప్పలేదు అని ఆయన తెలిపారు. పోలీసు వారు డోన్ కెమెరా ద్వారా చూసి పెట్టిన కేసులే గాని మాకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు . గత 20 సంవత్సరాల నుండి పెనుగంచిప్రోలు అభివృద్ధికి పాటుపడ్డాము గాని కేసులు గాని ఇతర ఏ విషయాల్లో మేము తలదూర్చలేదన్నారు. నాకు తోచినంత పేదవారికి సహాయం చేశాను గాని ఎవరి మీద నేను కేసు గాని ఇతరత్రా కార్యక్రమాల జోలికి వెళ్ళలేదన్నారు. లేనివారికి సహాయం చేయడమే గాని కేసులు పెట్టే సంస్కృతి మా దగ్గర లేదనీ,నేను గాని మా నాయకులు,కార్యకర్తలు గాని ఎప్పుడూ ఒకరికి సహాయం చేయాలని ఆలోచనతో ఉంటారన్నారు. కేసులు పెట్టే సంస్కృతి మాకు లేదు,అది మా తెలుగుదేశం పార్టీ సంస్కృతి . కాదన్నారు. ఇకనుండి అయినా వైకాపా నాయకులు అలాంటి ఆలోచనలు మానాలని కోరుకుంటున్నా అన్నారు.

## టిబి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దాం: జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా పిలుపు



కాకినాడ,మార్చి 24 (వార్తాప్రభ) : క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా పిలుపునిచ్చారు. ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా కాకినాడ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో నిర్వహించిన అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జెడ్పీ సెంటరు మీదుగా జ్యోతిబా పూలే విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ టిబిని అంతం చేయగలం అన్న నినాదంతో ఈ నెల ఈ రోజు ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా టిబి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్న మని చెప్పారు. 2025 నాటికి టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. జిల్లాలో టిబి వ్యాధి నిర్మూలనకు వివిధ చర్యలను చేపట్టామనన్నారు. క్షయ అన్నది అంటువ్యాధి అని,అనుమానిత లక్షణాలు ఉన్నవారు వెంటనే ఖళ్ళె పరీక్ష చేసుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం,ఆకలి మందగించడం,బరువు తగ్గడం,చాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రిపూట చెమట పట్టడం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,అలసటగా ఉండటం,మెడ వద్ద వాపు తదితర లక్షణాలు ఉంటే టిబి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిసెంబరు 7న ప్రారంభించిన 100 రోజుల టిబి కార్యక్రమంలో భాగం గా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు, నిర్ధార ణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని, టిబి వ్యాధి సోకేందుకు ఎక్కువగా అవకాశం ఉన్న 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి, వారికి బిసిజి టీకాలను వేయడం జరుగుతుందని జేసీ రాహుల్ మీనా తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ,టిబి రోగులు వ్యాధి నుంచి వేగంగా బయటపడాలంటే వ్యక్తిగత కృషితో పాటు, సామాజికంగా నైతిక సహకారం కూడా అవసరం అన్నారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుతూ తగిన జాగ్రత్తలను తీసుకొంటే ఆరు నెలల్లోనే టిబిని నయం చేయవచ్చునని చెప్పారు. టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం,ఇతర సహాయ సహకారాలను అందించేందుకు నిక్షయ మిత్రలు కృషి చేయాలని కోరారు. ఒక్కో వ్యాధిగ్రస్తుడికి నెలకు రూ.700 ఇవ్వడం ద్వారా నిక్షయ మిత్రలుగా మారవచ్చునని చెప్పారు. ఎన్పిఐ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు రూ.1000 చొప్పున ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. టిబి వ్యాధిని నయం చేసేందుకు అవసరమైన అన్నిరకాల మందులు, ఆధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా టిబి కంట్రోల్ అధికారి డా.ఆర్. రమేష్, డా.ప్రభాకర్ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు,వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పండ్ల తోటల రైతులను ఆదుకోండి

● ఒక ఎకరంకు లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలి. ● ముఖ్యమంత్రి కి డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి.



అనంతపురం,మార్చి 24 (వార్తాప్రభ) : రాష్ట్రంలో పండ్ల తోటల రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందనీ రిజర్వేషన్ల సంరక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, రైతు పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు అకాల వర్షాలు, మరొక వైపు తీవ్ర మైన ఎండలకు, ఇంకొక వైపు మార్కెట్ లలో దళారుల మోసాలు, గిట్టుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడి రాకపోతే రైతు జీవనం దిన దిన గండంగా మారుతూ అప్పుల పాలు అవుతూ చివరికి ఆత్మ హత్య ల వైపు మొగ్గు చూపుతున్నారనీ వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితి నుంచి రైతు ను గట్టింకించే బాధ్యతను ప్రభుత్వం తీసుకొని రైతులను ఆదుకోవాలని, ముఖ్యంగా రాయలసీమ జిల్లాలో రైతులు సరైన నీటి పారుదల లేక కూడా అనేకమంది రైతులు తమ పండ్ల తోటలను ఎండ బెట్టు కోవడం జరుగుతుందన్నారు. ఇలా అనేక ఇబ్బందులలో ఉన్న రైతులను ఆదుకోవాలని, అకాల వర్షాలకు దెబ్బ తిన్న పండ్ల తోటల రైతులకు ఒక ఎకరానికి ఒక లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, అలాగే చీని రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర టన్ను చీని కాయలకు 60వేలు ధర నిర్ణయించాలని, అరటి టన్నుకు 30వేల రూపాయలు నిర్ణయించాలని, మామిడి, బొప్పాయి, దానిమ్మ రైతు లకు గిట్టుబాటు ధర తో పాటు, పంటలు నష్ట పోయిన రైతుల కు ఎకరంకు ఒక లక్ష రూపాయలు చొప్పున నష్ట పరిహారం వ్యవసాయ శాఖ ద్వారా, ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని వర్గాల రైతు లకు వ్యవసాయ యంత్రాలను 90%శాతం సబ్సిడీ తో ఇవ్వాలని, పనికి ఆహార పథకంను వ్యవసాయంకు అను సంధానం చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, రైతు పరిరక్షణ సమితి అధ్యక్షులు డా. పోతుల నాగరాజు రాష్ట్ర ముఖ్యమంత్రి కి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మం త్రి కి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రైతు ల సమస్య లపై ముఖ్యమంత్రి కి లేఖ రాయడం జరుగుతుందన్నారు.

## శ్రీ దుర్గా దేవి ఆలయ నిర్మాణం కొరకు లక్ష రూపాయలు విరాళం

● సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం ● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు ● జనసేన నేత కొప్పిరెడ్డి ఎస్ ఎన్ మూర్తి వెల్లడి



విజయవాడ, మార్చి 24 (వార్తాప్రభ) : భవానిపురం పున్నమి ఘాట్ కరకట్ట వద్ద వేంచేసి ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయ పునఃనిర్మాణం నిధులు లేమితో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ సమస్యను ఆలయ కమిటీ సభ్యులు స్థానిక జనసేన పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పిరెడ్డి ఎస్ ఎన్ మూర్తికి తెలియచేసారు. తక్షణమే స్పందించిన ఆయన ఆలయ నిర్మాణం కొరకు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా కొప్పిరెడ్డి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సనాతన ధర్మ పరిరక్షణ పూర్తితోనే నేడు లక్ష రూపాయలు ఆలయ నిర్మాణము కొరకు అందించినట్లు తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పునః నిర్మాణం కోసం అనేక దాతల వద్దకు కూడా వెళ్లినట్లు తెలిపారు. నేడు జనసేన పార్టీ నేత ఎస్ ఎన్ మూర్తి దృష్టికి తీసుకురాగానే లక్ష రూపాయలు విరాళం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. దాతలు కూడా ఎవరైనా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణం కోసం కృషి చేస్తే త్వరలోనే భక్తులకు ఆలయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జూలూరి నాగ భూషణం, రేలంగి బుజ్జి, పైడి సూరిబాబు, జనసేన పార్టీ డివిజన్ అధ్యక్షులు తమ్మిన లీలా కుమార్, సురేష్ కురాకుల, జనసేన పార్టీ నగర నాయకులు స్టాలిన్ శంకర్, ముద్దన శంకర్ గన్ను, పశ్చిమ నియోజకవర్గం నాయకులు మాంతాపురం రాజేష్ రాజ్ మంతాపురం , కార్తికచంద్ర నమాన , రమా నాయుడు, గుండపు అక్షయ్ కుమార్, పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

● ఘనంగా ఆనంగి శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు.





గుంటూరు,మార్చి 24 (వార్తాప్రభ) : వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆనంగి శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక పాత గుంటూరు లోని ప్రగతి నగర్ నందు నివసిస్తున్న సుమారు వందమందికి పైగా నిరు పేద ప్రజలకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంతో పాటు బియ్యం, దుస్తులు, నిత్యవసర వస్తువులు మరియు పిల్లలకు బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. మన భారతీయ సంస్కృతిలో అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తుంటాము. అలాంటి అన్నం దొరకని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారు. వారికి ఒక పూటైనా సరే అన్నం ఏర్పాటు చేసినట్లయితే వారి ఆకలి తీర్చిన వారవుతాము అని ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ అన్నారు. ట్రస్ట్ సభ్యులు పేదలు నివసిస్తున్న పలు ప్రదేశాలను ఎంచుకొని అక్కడ వారికి భోజనం ఏర్పాటు చేయడం వల్ల చాలా సంతృప్తి కలుగుతుంది అని ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్ తెలియజేశారు. నిరుపేదలకు ఆహారం అందించడం, పలు గ్రామాలకు మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించడం, విద్య రంగం లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు విద్యా ఉపకరణాలను అందించడం మరియు మెరిట్ విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వడం పలు కార్యక్రమాలు ట్రస్ట్ తరపున జరుగుతున్నాయని ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆనంగి శ్రీనివాస యాదవ్, ఆనంగి రాణి రుద్రమదేవి ట్రస్ట్ వాలంటరీస్ ఆనంగి కృష్ణ తేజ యాదవ్, హర్ష, దుర్గాప్రవీణ్, సంతోష్ మరియు స్థానిక నాయకులు కార్పొరేటర్ యల్లావుల అశోక్ యాదవ్, అల్లం బాజి, శేఖర్, సైదా తదితరులు పాల్గొన్నారు.

## వై.ఎస్.ఆర్. పార్టీ వారు కావాలనే పసుపు,కుంకుమ బండి కట్టి అలజడి సృష్టించారు - జిల్లా టిడిపి కార్యదర్శి జిల్లేపల్లి



పెనుగంచిప్రోలు,మార్చి 24 (వార్తాప్రభ) : తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా అనిగండ్లపాడు నుండి అమ్మవారి పసుపు కుంకుమల బండ్లు బయలుదేరినవనీ,. ప్రశాంతంగా సాగిపోతున్న తిరుణాలలో అలజడి సృష్టించాలనే దురుద్దేశంతో అదే రోజు ఎప్పుడు లేని విధంగా పెనుగంచిప్రోలు నుండి వైఎస్ఆర్ పార్టీ వారు వారి ప్రభుత్వం అధికారం వున్న గత ఐదు సంవత్సరములలో ప్రభ బండి కట్టని వారు ఒక పథకం ప్రకారం కావాలని ప్రభ కట్టి ఏ విధంగా అయినా సరే మన ప్రభ బండి ముందుకు పోవాలని అనే ఆశయంతో బయలుదేరినారనీ టిడిపి నాయకుడు జిల్లేపల్లి రవికుమార్ పేర్కొన్నారు. పాత సినిమా హాల్ సెంటర్ మరియు డౌన్ సెంటర్లో వారి ఇష్టం వచ్చిన రీతిలో డిజె సౌండ్ లు పెట్టి ప్రజలను ఇబ్బందిలకు గురి చేశారన్నారు. తరువాత పోలీస్ స్టేషన్ దగ్గరికి వచ్చేసరికి పోలీసులు వారి బండిని కొంత సమయము ఆపినారనీ,దాన్ని తట్టుకోలేక అటువైపు వస్తున్న తెదేపా కార్యకర్తలపై వాటర్ బాటిళ్ళు విసిరరాన్నారు. కానీ వైసీపీ నాయకులు వారి కార్యకర్తల తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తెదేపా కార్యకర్తలపై నిందలు వేస్తున్నారన్నారు. వైకాపా నాయకులు ఒక వీడియో పెట్టినారనీ, ప్రజలారా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి, వాళ్లు విసిరిన రాయి కానిస్టేబుల్ కి తగిలినదన్నారు. ఆ వీడియోను స్లో మూమెంట్లో చూడండి మీకే అర్థమవుతుందనీ రవికుమార్ తెలిపారు. ఇవన్నీ చూడకుండా తెదేపా కార్యకర్తలు విసిరారని వీడియోలో వైకాపా నాయకులు ప్రసంగాలు చేస్తున్నారన్నారు.. ఇది కరెక్ట్ కాదు గ్రామంలో ఈ గొడవల వెనుక ఎవరి పాత్ర ఉన్నది అనేది ప్రజలు ఎప్పుడో గ్రహించారన్నారు. మీరు ఏదో వీడియోలు చేసి ప్రెస్ మీట్ లు పెట్టి ప్రజల మావైపు ఉన్నారు అనుకోవటం అవివేకం అన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాన్ని 2006లో ఏ విధంగా కేసులు పెట్టారో మరలా కేసులు పెట్టడానికి రెడీ అవుతున్నారని తెలుస్తుందనీ రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్న నాయకులు అరాచకాన్ని సృష్టించటానికి ప్రయత్నం చేస్తున్నారనీ ఎన్ టీ ఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు విలేకర్ల కు తెలిపారు.

## ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతి మన ప్రభుత్వ లక్ష్యం - ఎంపీడీవో చిన్న రాట్నాలు






విస్సన్నపేట,మార్చి 24 (వార్తాప్రభ) : స్థానిక మండలంలో 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఆదేశాలతో ప్రతి గ్రామంలో దిగువ స్థాయి 20 శాతం నిరుపేద కుటుంబాలను ధృవీకరణ చేయు నిమిత్తం పేదరిక నిర్మూలన పి 4 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి చిన్న రాట్నాలు తెలియజేశారు. ప్రతి ఇంటికి అభివృద్ధి లక్ష్యంగా మన ప్రభుత్వం అడుగులు వేస్తుందని సమిష్టిగా మనమందరం అభివృద్ధి పథంలో ముందడుగు వేద్దామన్నారు. ఈ కార్యక్రమం గ్రామపంచాయతీ కార్యాలయాలలో మంగళవారం నిర్దేశించిన సమయాలలో గ్రామ సభ ఇన్చార్జి( కార్యదర్శుల) ఆధ్వర్యంలో జరుగునని మీడియా సమావేశంలో ఎంపీడీవో తెలియజేశారు.

# “కోడి”కి కొప్పుల ప్రశంస!!

**అసలు సిసలైన కార్యకర్త అంటూ కితాబు**
**ఆభరణంగా భుజంపై గులాబీ జెండా**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)** జెండా మోయడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంలో అసలు సిసలైన కార్యకర్త కోడి రామకృష్ణ అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ కితాబు ఇచ్చారు. గోదావరి కన్నీటి గోస పేరిట చేపట్టిన వారం రోజుల మహా పాదయాత్రలో ఎక్కడ కూడా అలసిపోకుండా భుజంపై గులాబీ జెండాను ఆభరణంగా ధరించిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు అండగా నిలవాలను కోవడం వెలకట్టలేని అభిమానం అని ప్రశంసలు కురిపించారు. నమ్మి ఆరాధించే నాయకులు తనని మెచ్చుకొని ప్రశంసా పత్రాన్ని అందజేయడం తన జీవితంలో మర్చిపోలేని రోజు అని బీఆర్ఎస్ కార్యకర్త కోడి రామకృష్ణ తన మనసులోని మాటను సభాముఖంగా అందరికీ తెలపడం కొస మెరుపు.

# నిండు గోదావరి తెలంగాణకు మణిహారం!!

**కెసిఆర్ పాలనలో రైతాంగం సస్యశ్యామలం**
**గోదావరిని ఎండగొట్టింది ముమ్మాటికి సీఎం రేవంతే**
**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం**
**రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**నిండు గోదావరి తెలంగాణకు మణిహారం అని రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరి నదిని ఎండగొట్టినది ముమ్మాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆరోపిస్తూ అతని దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు చందర్ మాట్లాడుతూ....కెసిఆర్ పాలనలో రైతాంగం సస్యశ్యామలం అని తెలిపారు. రైతు బీమా, రైతు భరోసా పథకాల ద్వారా రైతును కంటికి రెప్పలా కాపాడినది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అని ప్రశంసించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంటలు ఎండిపోయినా, పంట నష్టంతో అప్పుల్లో కూరుకుపోయిన రైతులు మరణించిన తనకేమి పట్టదు అన్నట్టుగా, తనకేమీ బాధ్యత లేదు అన్నట్లుగా గోదావరి నది ఆధారితమైన బ్యారేజ్లలో నీటిని మొత్తం ఖాళీ చేసి రైతాంగానికి నరకం చూపిస్తున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ ఆరోపణలు గుప్పుమనిపించారు. రాబోవు రోజుల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని మళ్ళీ కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సొంత నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం.

**మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సహకారంతో...**

**జవహర్ నగర్,మార్చి, 24: (వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదవ డివిజన్ కారింగుల నర్సింగరావు (కేఎన్ఆర్) కాలనీలో సోమవారం కాలనీ ప్రజల సొంత నిధులతో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ సహకారంతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని కేఎన్ఆర్ కాలనీలో కాలనీవాసుల సొంత నిధులతో పాటు తన సహకారంతో భూగర్భ డీ డ్రైనేజీ పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందని కాలనీల అభివృద్ధికి ప్రభుత్వ నిధులే కాకుండా ప్రజలుసొంత నిధులను సేకరించి వెచ్చించడం ముదాబావమని తెలిపారు. కాలనీలో 260 మీటర్ల విస్తరణలో శంకుస్థాపన చేసిన శ్రీనివాస్ అనంతరం మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలని పట్టణాలని నగరాలని నగరాలలోని కాలనీలు అభివృద్ధి చెందుతేనే పట్టణం అభివృద్ధి చెందుతుందని తద్వారా దేశం అభివృద్ధి పదంలోకి పయనిస్తుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిధుల కోసం వేచి చూడకుండా తమ కాలనీ అభివృద్ధి కోసం కలసికట్టుగా కృషి చేయడం అభినందనీయమని ఇలాగే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్ ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జవహర్ నగర్ అభివృద్ధిపై తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధవ్, సింగన బాలరాజు, కెఎన్ఆర్ కాలనీవాసులు నంగునూరు అశోక్ గుప్తా, కారింగుల రాజు, పందిరి శ్రీనివాసులు, కూటి కంటి వెంకటేష్ గౌడ్, కందుల శంకర్, రాజు గౌడ్, మోహన్, ఉచ్చంతల రాములు, దుంపల రాములు, భాషెట్టి వీరేష్, సంద్రి గోపాల్, చంద్రమౌళి, రమేష్ చారి, అబ్దుల్లా, యాకమ్మ, మహేశ్వరి, పందిరి పద్మ, కే. పద్మ, మంజుల, యాదలక్ష్మి, మంజుల, అండాలు, లక్ష్మి, స్వరూప, లక్ష్మీ మోహన్, కైరునీస, తదితరలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అవగాహనే ఆయుధం...క్షయ వ్యాధి దూరం!!

● క్షయ వ్యాధి నివారణపై అవగాహన తప్పనిసరి ● టీబి నివారణ సమాజంలో అందరి బాధ్యత ● ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా ● మైక్రో బయాలజి ప్రొఫెసర్ డాక్టర్ ఓబులేషు






**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**అవగాహనే ఆయుధం, క్షయ వ్యాధి దూరం అని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ కళాశాలలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ కళాశాల(సిమ్స్) మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఓబులేషు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ....క్షయ నివారణ అనేది సమాజంలోని అందరి బాధ్యతగా భావించాలని అన్నారు. టీబీ బాక్టీరియా సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో గాలిలోకి విడుదలయ్యే చిన్న బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. టీబీ వ్యాధి ఉన్న వ్యక్తి దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు, పాడినప్పుడు, నవ్వినప్పుడు వారు టీబీని వ్యాప్తి చేస్తారు అని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేకత అవసరమని మాస్కు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ డాక్టర్ కిరణ్మయి, రవీందర్, సవిత, శారద, ఆంజనేయులు, నరేష్, అజయ్ కుమార్, ఉషారాణి అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దైవం “వీహెచ్ఆర్” రూపంలో!!

● రామగుండం ఆపన్న హస్తంగా “విహెచ్ఆర్” ● పుట్టిన ప్రాంతం కోసం అమెరికా ఎన్నారై హృదయ స్పందన ● మానవతా హృదయంతో ముస్లింలకు రంజాన్ తోఫా ● నిండు మనసుతో నిరుపేదలకు ఆర్థిక సహాయం ● నిస్వార్థంతో బాధిత కుటుంబాలకు భరోసా ● విశిష్ట సేవలను కొనియాడుతున్న సంఘ సేవకులు





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**దైవం “వీహెచ్ఆర్” రూపంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పలువురు కితాబునిస్తున్నారు. రామగుండం ఆపన్న హస్తంగా “విహెచ్ఆర్” ఫౌండేషన్ సేవలు రోజురోజుకు విస్తరిస్తున్నాయని ఎంతోమంది సంఘ సేవకులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పుట్టిన ప్రాంతం కోసం అమెరికా ఎన్నారై హృదయ స్పందనతో ఎంతో మందికి మేలు చేయడం మరువలేకపోతున్నమని వందలాది మంది నిరుపేదల కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నదని వ్యాల్ల హరీష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో దీవించాలని భగవంతుని సైతం ప్రార్థిస్తున్నారంటే అతని సేవలు రామగుండం నియోజకవర్గంలో ఏ స్థాయిలో కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని సభాముఖంగా మత పెద్దలు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆదివారం ప్రభుత్వం సైతం మరిచిపోయిన నేపథ్యంలో ముస్లిం సోదరుల కోసం సుమారు 500 ముస్లిం కుటుంబాలకు ఉడతా భక్తిగా రంజాన్ తోఫా అందించారు వి. హెచ్. ఆర్. ఫౌండేషన్ ప్రతినిధులు. ఈ కార్యక్రమానికి హరీష్ రెడ్డి తల్లిదండ్రులు రామ్ రెడ్డి, అనసూయ ముఖ్య అతిథిగా హాజరై ముస్లింలకు తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తన కుమారుడు ఉన్నాడని, పుట్టిన ప్రాంతం కోసం ఏదైనా చేయాలనే తపనతో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని అలాంటి కుమారుడికి తల్లిదండ్రులము కావడం తమకు గర్వంగా ఉన్నదని అన్నారు. హిందూ, ముస్లిం భాయి భాయి సంతోషం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఆటో కార్మికుల సంక్షేమం కోసం, నిరుపేదల ఆరోగ్యం కోసం, పేదవాడి కడుపు నింపడం కోసం, గరీబ్ సరస్వతీ పుత్రికల, పుత్రుల ఉన్నత చదువుల కోసం, గూడు, నిలువ నీడలేని పేదోడి ఇంటి నిర్మాణం కోసం, ఆడబిడ్డల వివాహం కోసం, ఇలా ఒక్కటేమిటి అంతులేని సేవలను అందిస్తున్న వ్యాల్ల హరీష్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు రాజకీయ సేవతో సమస్యలు పరిష్కరించాలి అని, ప్రజా సేవలో రెండు దశాబ్దాలు తరించాలి అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత పెద్దలు, నేతలు, ముస్లిం కుటుంబ సభ్యులు తెలిపిన హృదయపు భావన.



# హైదరాబాద్

## సేఫ్టీ ఫస్ట్... డ్యూటీ మస్ట్!!

● ఉత్పత్తి, ఉపాధికత పెంచే దిశగా చర్యలు
● వేసవికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
● సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**సేఫ్టీ ఫస్ట్... డ్యూటీ మస్ట్ అని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఓసిపి5 గనిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలను చేశారు. ఉత్పత్తి, ఉపాధికత పెంచే దిశగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి అని ఈ మేరకు నిత్యం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి అని సూచించారు. షావెల్ యొక్క పని స్థలాలను తనిఖీ చేశారు. గ్యాలరీలలో ఫైర్ ఆపడానికి తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంట ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ గబాలే , సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సర్వేయర్ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దహనంపై పోలీస్ శాఖకు ఫిర్యాదు!!

**బాధ్యులైన బిఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి**
**వన్ టౌన్ సిఐకి కంప్లైంట్ చేసిన కాంగ్రెస్ యూత్ లీడర్స్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**సీఎం దిష్టిబొమ్మ దహనంపై పోలీస్ శాఖకు ఫిర్యాదు చేశారు కాంగ్రెస్ యువ నాయకులు ఉదయ్ రాజ్, సతీష్, బండి రాము, నజీముద్దీన్. ఈ మేరకు సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని ఒకటవ పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డికి కంప్లైంట్ లెటర్ అందించారు. అనంతరం....చిత్తశుద్ధి ఉంటే శాస్త్రీయపరమైన చర్చకు రావాలని ఆ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

# సుజాతనగర్ లో మెడికల్ షాపుల మాయాజాలం


● నామమాత్రంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ల తనిఖీలు ● మీకు తల నొప్పోందా..? జ్వరం వస్తోందా? ● కడుపు నొప్పి.. ఒళ్లు నొప్పులతో భరించలేకుండా ఉన్నారా? నిద్ర పట్టడం లేదా? ● ఏం భయం లేదు. అనారోగ్య సమస్యలపై డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదు. ● మెడికల్ షాపుల మాయాజాలం ● ప్రిస్క్రిప్షన్ లేకుండానే అమ్మకాలు ● అడ్డగోలుగా ఔషధ వ్యాపారం ● ఫిజీషియన్ శాంపిళ్లు, కాలం చెల్లిన మందుల విక్రయాలు ● షాపుల్లో బినామీల దందా.. కానరాని ఫార్మసిస్టు రోగుల ప్రాణాలతో చెలగాటం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మెడికల్ షాపు చిన్నదైనా పెద్దదైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి విడమర్చి చెప్పాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టే అవసరమైన మందులు ఇవ్వాలి. ఇలా మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధలను పాటించాలి. కానీ సుజాతనగర్ మండల కేంద్రంలో మందుల దుకాణాల వ్యాపారం కిరాణ షాపుల్లా మారింది. డాక్టర్ రాసిచ్చే చిట్టీతో సంబంధం లేకుండా ఎవరడిగినా మందులు ఇచ్చేస్తున్నారు. డి-ఫార్మసీ/ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు.. మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.: మీకు తల నొప్పోందా..? జ్వరం వస్తోందా? కడుపు నొప్పి.. ఒళ్లు నొప్పులతో భరించలేకుండా ఉన్నారా? నిద్ర పట్టడం లేదా? ఏం భయం లేదు. అనారోగ్య సమస్యలపై డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదు. తలెత్తిన అనారోగ్యం గురించి చెబితే చాలు.. మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులూ ఇస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా ఇస్తారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరమే లేదు. ఏ మందులు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్ని రోజులు వాడాలో కూడా మెడికల్ షాపుల నిర్వాహకులే చెప్పేస్తారు. ఈ విధంగా సుజాతనగర్ లో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం నిర్వహిస్తున్నారు. అల్లోపతి మెడిసిన్ విచ్చలవిడి అమ్మకాలపై ఔషధ నియంత్ర అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. నిబంధనల ప్రకారం వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో మందులు ఇవ్వాలి. ఈ నిబంధనలను చాలా మంది దుకాణదారులు పాటించడం లేదు. జ్వరం, జలుబు, తలనొప్పి, కడుపునొప్పి గ్యాస్ట్రిక్ సమస్యలు, ఒంటినొప్పులు తదితర సమస్యలకు మెడికల్ షాపుల్లో అడగ్గానే మందలిస్తున్నారు. కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈ వ్యాధుల ఔషధాల్లో హై డోస్.. లో డోస్ అనే రకాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయసు, శరీర తత్వం తదితరాలను బట్టి డాక్టర్లు మెడిసిన్ను నిర్ణయిస్తారు. సాధారణంగా మెడికల్ షాపునకు వెళ్లి అడిగితే ఏ రోగానికైనా, ఎన్ని మందులు కావాలన్నా ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు కొందరు దగ్గుకు వాడే సిర్‌పలు తాగుతున్నారు. కోరెక్స్, పెన్సిడ్రిల్ వంటి ఔషధాలు కొంత మత్తును కలిగిస్తాయి. ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాలకు బానిసైనవారు అవి దొరకని సమయాల్లో మెడికల్ సిర్‌పలు వాడుతున్నారు. ఈ తరహా సిర్‌పలు డాక్టర్ రాసిస్తేనే రోగికి ఇవ్వాలి. కానీ కొన్ని మెడికల్ షాపుల్లో ఎవరెన్ని, ఏమి అడిగినా ఇచ్చేస్తున్నారు.

**ఎక్స్‌పైర్డ్ మందులూ అమ్ముతున్నారట** డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులను అంటగడుతున్నారు. ఏమన్నా అంటే.. ‘సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.’ అని చెబుతున్నారు. జిల్లాలో పనిచేసే డ్రగ్ ఇన్స్పెక్టర్ల అడ్రెస్సే లేదు. వారు ఎక్కడ ఉంటారో.. ఏ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. అనేక షాపుల్లో కాలం చెల్లిన మందులు యథేచ్ఛగా అమ్ముతున్నారు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు ఫార్మసిస్ట్ సర్టిఫికెట్లతో మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇష్టానుసారం మెడికల్ షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు.

**లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది,,** సుజాతనగర్ లో మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలను నిర్వహించాలి.. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఏడీలు మెడికల్ షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లతో ఒప్పందాలు చేసుకొని మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారు.

**మామూళ్ల మత్తులో...**డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం ప్రతీ మెడికల్ షాపులో రిజిష్టర్డ్ ఫార్మసిస్టు ఉండాలి. బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ ఇలా ఏదో ఒక ఫార్మసీ కోర్సు చేసిన వారు మాత్రమే మెడికల్ షాపు నిర్వహించాలి. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఫార్మాసిస్టు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలి. ఏరియా ఇన్స్పెక్టర్లు ఈ బాధ్యత నిర్వర్తించాలి. కానీ కొందరు ఏరియా ఇన్స్పెక్టర్లు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



**పర్సంటేజీలు మాట్లాడుకొని...**జనరిక్, నాన్ జనరిక్ అనే తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని మెడికల్ షాపులు, కెమిస్ట్ డ్రగిస్ట్ ఏజెన్సీలపై దృష్టిసారించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# ఎడిటోరియల్

## జగన్ వర్సెస్ విజయసాయిరెడ్డి...కంటిన్యూ !

వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ ఎంపీ వి విజయసాయిరెడ్డిల మధ్య అనుబంధం అందరికీ తెలిసిందే. విజయసాయిరెడ్డి కేరాఫ్ వైఎస్సార్ ఫ్యామిలీ అని అంతా అంటారు. ఆయన కూడా వైఎస్ రాజారెడ్డి నుంచి మొదలుపెట్టి రాజశేఖర్ రెడ్డి జగన్ దాకా కలసి నడిచారు. అలా మూడు తరాలతో అనుబంధం పెనవేసుకున్నవారుజగన్ ని విజయసాయిరెడ్డిని వేరుగా చూసే వాతావరణం ఎపుడూ లేదు అని చెప్పాలి. జగన్ మేలు కోసం విజయసాయిరెడ్డి తపన పడేవారు. విజయసాయిరెడ్డిని కుటుంబం మనిషిగా జగన్ చూసేవారు. ఇద్దరూ కలసి కష్టాలు నష్టాలూ అన్నీ చూశారు. వైసీపీని జగన్ ప్రారంభిస్తే దానికి అండగా దండగా విజయసాయిరెడ్డి ఉంటూ వచ్చారు. ఆయన మేధస్సు, వ్యూహాలు వైసీపీకి శ్రీరామ రక్షగా ఉండేవారు.జగన్ తో సమానంగా విజయసాయిరెడ్డిని పార్టీ నాయకులు క్యాడర్ అభిమానించేవారు. ఈ ఇద్దరూ వేరు పడతారు అని ఎవరూ అనుకోలేదు. ఆ మాటకు వస్తే విజయసాయిరెడ్డి కూడా అనుకోని ఉండరు. కానీ అది జరిగిపోయింది. కొత్త ఏడాది మొదటి నెలలోనే వైసీపీకి ఎంపీ పదవికి రాజకీయాలకు రాజీనామా చేస్తున్నట్లుగా విజయసాయిరెడ్డి ప్రకటించి సంచలనం రేపారు.ఆ తరువాత ఆయన తాను పార్టీని వీడడానికి కారణం జగన్ వెనక ఉన్న కోటరీ అని ఆరోపించారు. జగన్ ఈ రోజుకీ అర్ధం చేసుకోలేకపోతున్నారు అని కూడా ట్వీట్ల ద్వారా విమర్శలు చేశారు. తాజాగా చూస్తే ఆయన తెలంగాణాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ ని పొగుడుతూ ట్వీట్ చేశారు. డీలిమిటేషన్ మీద కేటీఆర్ మాట్లాడుతూ అన్న మాటలను విజయసాయిరెడ్డి సమర్ధించారు.జీడీపీ ఆధారంగా ఎంపీ సీట్ల సంఖ్య పెంచాలన్న కేటీఆర్ సూచనలను మెచ్చుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల మీద కేంద్రం వివక్ష చూపదని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని కూడా గుర్తు చేశారు. డీలిమిటేషన్ మీద కేటీఆర్ ఆవేదన ఆందోళనకు ఆయన మద్దతు ప్రకటించారు.అయితే విజయసాయిరెడ్డి జగన్ విషయంలో మాత్రం పూర్తిగా విస్మరించారని అంటున్నారు. కావాలనే ఆయన జగన్ ని ఇగ్నోర్ చేశారా అన్న చర్చ అయితే సాగుతోంది. డీలిమిటేషన్ మీద జగన్ సైతం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాసారు. దామాషా పద్ధతిలో ఎంపీల సీట్లు పెంచాలని ఆయన విలువైన సూచనలే చేశారు.నిజానికి జగన్ సూచన కూడా బాగానే ఉంది. మరి విజయసాయిరెడ్డికి జగన్ డీలిమిటేషన్ మీద మాట్లాడిన మాటలు ఆయన ఆవేదన కనబడలేదా అన్న చర్చ సాగుతోంది. ఒకే ఇష్యూ మీద రెండు తెలుగు రాష్ట్రాల కీలక పార్టీల అధినేతలు మాట్లాడారు అందులో సొంత రాష్ట్రం నాయకుడు జగన్ ఉన్నారు. పైగా నిన్నటి దాకా విజయసాయిరెడ్డి ఆ పార్టీలో ఉన్నారు.కానీ ఎన్నడూ తలవని బీఆర్ఎస్ నాయకుడి విషయంలోనే విజయసాయిరెడ్డి రెస్పాండ్ కావడం ఆయనను ప్రశంసించడం మీద చర్చ సాగుతోంది. అదే సమయంలో జగన్ ఊసు ఎత్తకుండా వ్యవహరించడంతో తమ మధ్య గ్యాప్ అలాగే కంటిన్యూ అవుతుందని చెప్పకనే చెప్పేసారు అని అంటున్నారు.జగన్ పేరు ఎత్తకుండా కేటీఅర్ ని మధ్యలోనికి తెచ్చి ట్వీట్ వేయడంలోనే విజయసాయిరెడ్డి వ్యూహం ఉందని అంటున్నారు. అంటే ఏపీలో వైసీపీ అధినేత కంటే కేటీఅర్ ది బెస్ట్ గా డీలిమిటేషన్ విషయంలో వ్యవహరించారని విజయసాయిరెడ్డి భావమా అన్నది కూడా చర్చిస్తున్నారు. విజయసాయిరెడ్డి రాజకీయ మేధావిగా పేరు పొందారు ఆయన ఏమి చేసినా అందులో అర్ధాలు పరమార్ధాలు ఎన్నో ఉంటాయి. ఇపుడు ఈ ట్వీట్ ద్వారా కూడా ఆయన ఏమైనా సందేశం ఇచ్చారా అన్నది కూడా అంతా చర్చిస్తున్నారు. మొత్తానికి జగన్ వర్సెస్ విజయసాయిరెడ్డి కంటిన్యూ అన్నది మాత్రం మరోసారి రుజువు అయింది అని అంటున్నారు.


## ప్లాస్టిక్ పై యుద్ధం ప్రకటించిన బందరు ప్రజానీకం.



**మచిలిపట్నం మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ను నిషేదిద్దాం అనే నినాదం తో ఉన్న పోస్టర్ ను ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణాజిల్లా మచిలీపట్నం నందు కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీమ్ పాల్గొన్నవారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్. ఈ సందర్భంగా బందరు నగర హ్యూమన్ రైట్స్ కన్వీనర్ లక్ష్మి ఉషా మాట్లాడుతూ ఇటీవల కొత్త జబ్బులు రావడానికి ముఖ్య కారణం ప్లాస్టిక్ వాడకమే ,తద్వారా హార్మోన్ వ్యవస్థ దెబ్బతిని క్యాన్సర్ ,షుగర్ లాంటి జబ్బులు వస్తున్నాయి అని అన్నారు. ప్లాస్టిక్ అంత డ్రైనేజీలో పేరుకు పోతున్నాయని. బందరు నగరం లో వర్షం కురిస్తే డ్రైనేజ్ లు పొంగి పొర్లుతున్నాయని కారణం ప్లాస్టిక్ ఎక్కువగా వాడకమే అని అన్నారు .త్వరలో ప్లాస్టిక్ రహిత బందరు ను తయారు చేసి రాష్ట్రం లో నే ప్లాస్టిక్ రహిత నగరం గా బందరును అభివృద్ధి చేయాలి అని హ్యూమన్ రైట్స్ సంకల్పించింది అని అన్నారు. దీనికి బందరు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి , లక్ష్మీ ఉష , రేవతి , డాక్టర్ గౌతం , తదితరులు పాల్గొన్నారు.

## కన్నోళ్లు దేవుళ్ళు

అమ్మ చెప్పే మాట
నాన్న చూపే బాట
ఈ చిన్ని బ్రతుకులో
అగునోయ్! కంచుకోట
అమ్మ తీయని ఊట
మదిని దోచే పాట
జాలువారును ఇంట
శుభములు ఆమె నోట
నాన్న మమతల మూట
వారే లేని పూట
గడవదు క్షణమైనా
మనసున హైరానా
మహిలో కన్నవారు
మదిలో మిన్న వారు
వారికి సాటెవ్వరు!
ఎవరు లేనేలేరు!
కాసింత ప్రేమతో
పలకరిస్తే చాలు
ఘనమైన మనసుతో
ఆదరిస్తే మేలు



కన్నోళ్లు దేవుళ్ళు
తెరువు గుండె లోగిళ్ళు
జన్మ దాతలు వారు
మార్చుకో! నీ తీరు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు

# ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా క్షయ నియంత్రణ అవగాహన ప్రదర్శన

- క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదు ..నియంత్రణ మన చేతుల్లోనే వుంది
- క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి
- షేక్ రాజా సాహెబ్ సిహెచ్ సి సూపరిండెంట్ డాక్టర్ శాంతి కిరణ్ పిలుపు





**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని నియంత్రణ మన చేతుల్లోనే ఉందని దాన్ని వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాతబస్తీ కొత్తపేట లోని షేక్ రాజా సాహెబ్ (ప్రసూతి) మినీ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శాంతి కిరణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రి వద్ద డాక్టరు శాంతి కిరణ్ పర్యవేక్షణలో క్షయ వ్యాధి నియంత్రణ అవగాహన ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ వ్యాధి యొక్క లక్షణాలు వ్యాప్తి చెందే విధానం వ్యాధి యొక్క చికిత్స విధానం పోషకాహారం గురించి వివరించారు అలాగే టీబీ రోగులకు ఔషధాలతో పాటుగా వారి పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా రోగుల బ్యాంకు ఖాతాల్లో వెయ్యి రూపాయలు జమ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ సి డాక్టర్లు మరియు టీబీ యూనిట్ సిబ్బందితో పాటుగా ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిరామ్ , డాక్టర్ వాణిశ్రీ , డాక్టర్ గౌస్ భాషా , డాక్టర్ స్రవంతి , పీజీ డాక్టర్లు, కొత్తపేట డౌన్ యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మ నాగేంద్రరావు, ఎన్ టి ఈ పి సిబ్బంది ట్రీట్మెంట్ సూపర్వైజర్ ప్రాన్సిస్, ల్యాబ్ సూపర్వైజర్ జోసెఫ్ తంబి, టిబి హెల్త్ విజిటర్స్ లలిత కుమారి, రమీజా, ల్యాబ్ టెక్నీషియన్ బాజీ ప్రసాద్, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

## రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర

**విజయవాడ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర తెలిపారు, రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం లోని ఇంగ్లీష్ పాలెం గౌసియా మసీదు నందు ఇఫ్తార్ విందు నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు, ముందుగా ఉపవాస దీక్ష విరమణ ప్రార్థనలో రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ,ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి అన్నారు, కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సమాజంలో మనుషుల మధ్య సోదర భావం సమానత్వాన్ని పెంపొందించే పండగే రంజాన్ అన్నారు అనంతరం రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో సమానత్వం



నింపేందుకు ఇఫ్తార్ విందులు దోహదపడతాయి అన్నారు, ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపేట వేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల పక్షపాతి తెలిపారు, ఈ కార్యక్రమానికి జనసేన ఇన్చార్జి రామకృష్ణ , కొనకళ్ళ బుల్లయ్య ,మాజీ మున్సిపల్ చైర్మన్ బాబు ప్రసాద్, మాదివాడ రాము, ఇలియాస్ పాషా, వసీం బేగ్, పలపాటి సుబ్రహ్మణ్యం మరియు తదితరులు పాల్గొన్నారు.

# హలీమ్‌కు... సలాం....అంటున్న అన్ని వర్గాల ప్రజలు

- రంజాన్ మాసంలో రూ కోట్లు దాటుతున్న పసందైన రుచుల అమ్మకాలు
- ఏటేటా పెరుగుతున్న వినియోగదారులు









(యేమినేని వెంకట రమణ)

**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రంజాన్... ఈ పండుగ వచ్చిందంటే ఎవరికైనా హలీమ్ గుర్తుకొస్తుంది. హలీమ్ అనగానే హైదరాబాద్ వైపు అందరి మనస్సూ లాగేస్తుంది. అయితే మనం ఇపుడు అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు. విజయవాడలోనూ హలీమ్ను అందించే మరో హైదరాబాద్ ఉంది. హైదరాబాదీలకు పాతబస్తీ ఎలాగో, మన విజయవాడ పాతబస్తీలోని వించిపేట అలాంటిదే. రంజాన్ పర్వదినాన వించిపేట ప్రాంతమంతా రంగు రంగుల విద్యుత్ దీపాలతో వెలిగిపోతుంది. పండుగ సమయంలో కేవలం ముస్లింలే కాదు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఇతరులు సైతం ఇక్కడకు వచ్చి హలీమ్ రుచి చూస్తారు. రాత్రి సమయంలో వించిపేట వెళితే వంజా సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు రోడ్డు పొడవునా రంజాన్ శోభ కనిపిస్తుంది. రోడ్డుకు రెండు వైపులా పలు రకాల నాన్ వెజ్ వంటకాలను అందించే షాపులు, ఐస్క్రీమ్లు, ఫలుదా షాపులు, మీటా పాన్ షాపులు కనిపిస్తాయి. వీటన్నింటి కంటే ప్రతి ఒక్కరినీ హలీమ్ సెంటర్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బెజవాడలో హలీమ్ అనగానే వించిపేటలోని హలీమ్ సెంటర్స్ గుర్తుకువస్తుంది.రెండు దశాబ్దాల క్రితం వరకు హలీమ్ అంటే ముస్లింలకు మినహా మిగిలిన వారికి అంతగా తెలియదు. అసలు అది ఎలా ఉంటుందో కూడా చూసుండరు. పండుగ రోజుల్లో ఉపవాస దీక్ష చేసే వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు దీక్ష విరమణ అనంతరం పుష్టికరమైన హలీమ్‌ను తీసుకోవటం ఆనవాయితీగా వస్తోంది. దీక్ష విరమణ సందర్భంగా ఇఫ్తార్ విందుకు ఎంతటి ప్రాధాన్యం ఉంటుందో, హలీమ్‌కు అంతటి విశిష్టత ఉంది. విజయవాడలో హలీమ్ కేంద్రాలు లేనప్పుడు ఎవరికి వారు ఇళ్ళలోనే సొంతంగా దీనిని తయారు చేసుకునే వారు. ఈ నేపథ్యంలో 2003 లో తొలిసారిగా విజయవాడ వించిపేటలో హలీమ్ సెంటర్ ప్రారంభమైంది. హైదరాబాద్ తరహాలో రుచులను అందించేందుకు ప్రత్యేకంగా అక్కడి నుంచే తయారీదారులను రప్పించారు. మొదట్లో ముస్లింలు మాత్రమే హలీమ్‌ను తినేవారు. ముస్లిం యువకులు తమ స్నేహితులకు హలీమ్ పెట్టడం ఒక ప్రతిష్టగా తీసుకున్నారు. దీంతో తరుచూ రంజాన్ సమయంలో స్నేహితులను ఆహ్వానించి హలీమ్‌ను తినిపించి పంపించేవారు. అలా ఆ నోటా, ఈ నోటాతో హలీమ్ ప్రతి ఒక్కరూ నోరుఊరేంది.జిల్లాకు చెందిన వారే కాకుండా పొరుగు జిల్లాల వారు ఎవరైనా సరే బెజవాడ వస్తే తప్పకుండా హలీమ్ తినకుండా వెళ్లరంటే ఆతిశయోక్తి కాదు.

**42 రకాల పదార్థాలతో ..తయారౌతున్న హలీమ్.** భోజన ప్రియులను ఊరించే హలీమ్ తయారీకి 42 రకాల పదార్థాలను వినియోగిస్తారు. సహజంగా వేట మాంసం(మటన్)తో హలీమ్ తయారు చేస్తారు. కాలక్రమంలో కోడిమాంసంతోనూ(చికెన్) హలీమ్‌ను తయారు చేస్తున్నారు. మటన్‌తో పాటు నాణ్యమైన నెయ్యి, ఇలాచీ, లవంగం, దాల్చినచెక్క, సాజీరా, మిరియాలు, గోదుమరవ్వ, బాస్మతీబియ్యం, ఉప్పు, నిమ్మకాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర, కంది, బాదం, మినుము, కాజు, పుప్పు దినుసులు,మరో 20 రకాల సుగంధ ద్రవ్యాలను ఉపయోగిస్తారు. పొటేల్ మాంసాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన భట్టి(కట్టెల పొయ్యి) నీటిలో ఉడుకబెట్టి తయారు చేసిన పొడవాటి కర్రతో గిలకొడుతారు. ఇలా తయారైన మిశ్రమంలో నెయ్యి, కొత్తిమీర, వేయించిన ఉల్లిగడ్డలు వేసి వేడివేడిగా పడ్డిస్తారు. ఇరాన్ నుంచి నగరానికి వచ్చిన ఓ కుటుంబం హైదరబాద్ పాతబస్తీలోని చార్మినగర్ వద్ద హెూటల్ పెట్టి హలీమ్ విక్రయాలను ప్రారంభించిందని, అలా హలీమ్ రుచులు జిల్లా వ్యాప్తంగా వ్యాపించాయని చారిత్రకారులు చెబుతున్నారు.

**తయారీకి 12 గంటల సమయం** హలీమ్ తయారు చేసేందుకు కనీసం 12గంటల సమయం పడుతోంది. ఉదయం ఆరున్నర గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు హలీమ్ తయారు చేస్తారు. ఇందు కోసం పదుల సంఖ్యలో పరిశ్రమిస్తున్నారు. హైదరాబాద్‌కు ఏమాత్రం తీసిపోకూడదనే ఉద్దేశంతో అక్కడ నుంచే వంట వారిని తీసుకువచ్చి హలీమ్‌ను అందిస్తుండటం విశేషం.

**కేరాఫ్ వించిపేట... హైదరాబాద్‌కు దీటుగా తయారీ** అత్యంత ఇష్టంగా తినే హలీమ్ నాణ్యతలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదని హలీమ్ నిర్వహకులు జెడ్ అండ్ ఎస్ భాషి హలీమ్ సెంటర్ అధినేత షేక్ భాషి చెబుతున్నారు. ఇందుకోసమే హైదరాబాద్ నుంచి పాకశాస్త్ర నిపుణులను రప్పించి హలీమ్‌ను తయారు చేయిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ వించిపేటలోనూ హలీమ్‌కు మంచి పేరు పొందింది. రంజాన్ సమయంలో హలీమ్‌లు తినేందుకు వచ్చిన వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అలాగే అనేక మంది పార్శిల్స్ కూడా తీసుకువెళుతున్నారు. రంజాన్ మాసం మరో తొమ్మిది రోజుల ఉండటంతో విజయవాడ వించిపేటలోని హలీమ్ స్టాల్స్ కీటకీటలాడుతున్నాయి.

# ఎస్సీ ఏరియాలో సామాజిక భవన నిర్మాణం చేపట్టాలి



**ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:మండల కేంద్రంలో గల ఎస్సీ ఏరియాలో సామాజిక భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల ప్రజా వేదికలో టి ఎన్ టి యు మండల అధ్యక్షులు చాట్ల బాబురావు మెమోరాండం సమర్పించారు. అలాగే రెడ్డిగూడెం దళితవాడ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి షెడ్డు నిర్మించాలని ఎంపిడిఓ రమణ కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లిపాం రమేష్ పాల్గొన్నారు.

# సర్వమత సంస్కర్త ఐజా గ్రూపు చైర్మన్ షేక్ గయాసుద్దీన్ ( ఐజా)



**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హిందూ.. ముస్లిం.. క్రైస్తవ మతస్థుల పండుగలు, పర్వ దినాలు సందర్భంగా అన్ని వర్గాలను ఒకేలా ఆదరిస్తున్న ఐజా గ్రూపు చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) సర్వమతసంక్షర్తని పలువురు కొనియాడారు. వినాయక చవితి పందిళ్ళకి, క్రిస్టమస్ వేడుకలకు,అలాగే రంజాన్ మాసం సందర్భంగా రంజాన్ తోఫా ఏదైనా గాని అందరికీ ఒకే విధంగా లక్షలాది రూపాయలు ఆర్థిక చేయూత అందిస్తున్న ఐజా దాతృత్వం ఆదర్శనీయమే... 40వ డివిజన లోని శ్రీ దుర్గాభవాని దేవస్థానం గుడి నిర్మాణం కొరకు లక్ష రూపాయల విరాళం దేవస్థానం కమిటీ పెద్దలకు.. ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గాయసుద్దీన్ ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమం లో ఐజా గ్రూప్ సభ్యులు మరియు దేవస్థానం కమిటీ సభ్యులు పల్కొన్నారు.

# అద్దంకి వారి పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న దారపనేని



**కనిగిరి మార్చి 24 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పోతవరం గ్రామ వాస్తవ్యులు అద్దంకి నాగమల్లేశ్వరరావు శ్రీమతి లక్ష్మి దంపతుల కుమార్తె విజయలక్ష్మి పుష్పాలంకరణ వేడుక విజయవాడలోని వారి స్వగృహం నందు ఘనంగా నిర్వహించారు. ఈ పుష్పాలంకరణ వేడుకలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని విజయలక్ష్మిని అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఉమామహేశ్వరరావు, ప్రకాష్, చిన్నారావు, తిరుపాలు, మాల్యాద్రి, మల్లికార్జున, మహేష్, నాగరాజు, చీర్లదిన్నె సుబ్బారావు, నాగభూషణం అద్దంకి వారి కుటుంబ సభ్యులు, నాదెళ్ల వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని విజయలక్ష్మిని అక్షింతలతో ఆశీర్వదించారు.

# ఎక్కువ మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న వారి పై చర్యలు



**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఎక్కువ మొత్తంలో ఉన్న పన్ను బకాయిల అసెస్మెంట్ లపై చర్యలు తీసుకున్నారు వీఎంసి రెవెన్యూ సిబ్బంది. అందులో భాగంగా సత్యనారాయణపురం, గవర్నర్పేట, సీతన్నపేట ప్రాంతాలలో గల ఎక్కువ కాలంగా భారీ మొత్తంలో బకాయిలు ఉన్న షాపులకు తాళం వేశారు రెవెన్యూ సిబ్బంది. పన్ను బకాయలు మొత్తం తిరిగి చెల్లించిన తర్వాతే వారి సేవలను వారు కొనసాగించవచ్చని వారికి తెలియజేశారు.నగరంలోని ప్రజలందరూ మార్చ్ 31, 2025 లోగా విజయవాడ నగరపాలక సంస్థ వారికి చెల్లించవలసిన వివిధ రకాలైన ఆస్తి, ఖాళీ స్థలాల, డ్రైనేజ్, మంచినీటి పనులను చెల్లించి విజయవాడ నగరాభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు.

# రంజాన్ పురస్కరించుకొని పేదలకు బట్టలు పంపిణీ

## ఆల్లుర్తి ఉప సర్పంచ్ ఖాదర్ బాషా



**పొదలకూరు మార్చి 24 (వార్తాప్రభ)** మండలంలోని ఆల్లుర్తి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఖాదర్ బాషా రంజాన్ పండుగను పురస్కరించుకుని ముందస్తుగా పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రెండు పండుగలు ముఖ్యమన్నారు. ఒకటి బక్రీద్ మరొకటి రంజాన్ బక్రీద్ త్యాగానికి ప్రతీక కాగా రంజాన్ దాన ధర్మాలకు ప్రతీక అన్నారు. కావున రంజాన్ పండుగను పురస్కరించుకుని వారం ముందుగానే తమ గ్రామంలో పేదలకు బట్టలు పంపిణీ (జకాత్) చేశామన్నారు. అలాగే పండుగ రోజు బిర్యానీ పొట్లాలతో పాటు మిఠాయిలు పంచుతామన్నారు.గ్రామంలో సుమారు వంద మంది పేదలకు బట్టలు పంచినట్టు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని గత పదేళ్ల నుంచి తూచా తప్పకుండా చేస్తున్నట్లు అన్నారు.ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా కుటుంబ సభ్యులు మస్జీద్ పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైభవంగా ఉషా బహుమతులు పండుగ





**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉషా సాహితి పత్రికల నేతృత్వంలో జరిగిన బహుమతులు పండుగ విజయవాడ కేబీఎన్ కాలేజీ ఆవరణలో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉషా ఎడిటర్ ఇన్ చీఫ్ శరత్ చంద్ర అధ్యక్షత వహించారు. ఉషా నేతృత్వంలో జరిగిన సుజనా ఫౌండేషన్ నవలలు పోటీ, వెలగపూడి సీతారామయ్య కథ నవలలు పోటీ, తటవర్తి భారతి ప్రపంచం స్థాయి కథల పోటీ, సింగీతం ఘటికా చల రావు తల్లిదండ్రుల స్మారకంగా, తాడికొండ దామోదర్ రావు తన తండ్రి తానికొండ నాగయ్య పేరుతో నిర్వహించిన కథలు పోటీ విజేతలకు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి బహుమతి ప్రధానం చేశారు ఇందులో భాగంగా సుజనా నవలలు పోటీ విజేత లకు ఐదు లక్షల వరకు సుజనా బహుమతులు ప్రధాన చేశారు. మిగతా పోటీలకు స్పాన్సర్ చేసిన వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, సింగీతం ఘటికా చలరావు.. తానికొండ దామోదర్ బహుమతులు ప్రధానం చేశారు. దరిదాపు తొమ్మిది లక్షల వరకు బహుమతులు ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ఆ సృజనా నవల ల పోటీకి స్పాన్సర్ చేసిన సుజనా చౌదరి మాట్లాడుతూ తెలుగు భాష బతికుండ దానికి సాహిత్యం దోహదపడుతుందని. ఆ దిశగా కృషి చేస్తున్న ఉష పత్రికను ఆయన అభినందిస్తూ ఉషా కోరుకున్నట్టు రాబోయే రోజుల్లో రచయితల పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా కృషి చేస్తానన్నారు. ఉషా నిలదుక్కోవడానికి తర్వాత సహకారం చేస్తానన్నారు.. అదేవిధంగా ఉషా స్థల సేకరణ జరిపితే భవన సర్ ఒక టూ మినిట్స్ నిర్మాణాన్ని కూడా సహకరిస్తాను అన్నారు. వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యాన్ని బతికించుకోవడం సమాజానికి అవసరం అన్నారు. శాసనసభ్యుడు మండల బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అచ్చు పత్రికలు మాయమవుతున్న ఈ సంధి కాలంలో ఉషా ముందుకు వచ్చి పత్రిక నడపడం ముదా వాహమని, ప్రభుత్వం దృష్టికి రచయితల సమస్యలు తీసుకెళ్తున్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యం నడుస్తున్న సమాజానికి దర్పణం అని, ఆ దిస్ గా ఉష కృషిచేయడం అభినందనీయ మన్నారుసమావేశానికి అధ్యక్షత శరత్చంద్ర మాట్లాడుతూ రాబోయే తరాలు పరీక్షించుకోవడానికి సాహిత్యమే సోపానం అన్నారు. రచయితలకి ఉపయోగ పడేలా ఉషా భవన్ నిర్మాణాన్ని చేపడతాం అన్నారు. రచయితల డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరావు హామీ ఇచ్చారు, సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

**ఉషా లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్స్** ఉషా లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుకి ఎంపికైనవిహారి, సింహ ప్రసాద్, మందా భానుమతి, వసుంధర, ప్రముఖ చిత్రకారుడు ఏవిబిస్ ఆనంద్, స్వరమాంత్రికుడు వెంపటి కామేశ్వరరావు, అత్తలూరు విజయలక్ష్మి, జగన్నాథ్ శర్మ వంటి సాహితీ దిగ్గజాలకు ఉషా అవార్డులు ప్రకటించి సన్మానించింది. కాగా వారికి విద్యావేత్త బిఆర్ అంకం, మాజీ శాసన మండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భరత్ కుమార్, ప్రముఖ పారిశ్రామిత్త కే వెంకటేశ్వర్లు, ప్రమోదిని తదితరులు లైఫ్ టైం నచ్చింది అవార్డు నగదు బహుకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమం సమన్వయం ఉష ఆహ్వాన కమిటీ చైర్మన్ కట్ట రాంబాబు, ప్రముఖ రచయిత్రి కరవధి సరస్వతి, ఉషా ఎడిటోరి యల్ యూటర్న్ బోర్డు సభ్యులునాగ మౌనిక, నాగేశ్వరి, ఉగాది వసంత, సుధారాణి పూడిపెద్ది తదితరులు పాల్గొన్నారు. సభలో 200 మందిపైనే రెండు తెలుగు రాష్ట్రా లకు చెందిన రచయితలు పాల్గొన్నారు

## నిమ్రా అధ్యాపకురాలికి పీ హెచ్ డి



**ఇబ్రహీంపట్నం మార్చి 24(వార్తా ప్రభ ప్రతినిధి):-** నిమ్రా ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న దేవి గుణ శిరీషకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పీహెచ్ డి డిగ్రీ ప్రధానం చేసింది. శిరీష సమర్పించిన గ్రంథం 'ఫార్మా లాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ ఆయిల్ అండ్ దేర్ ఫార్ములేషన్స్ ఫర్ ట్రీట్మెంట్ ఆఫ్ పార్కింగ్ డిసీజ్'ను ఆచార్య విద్యావతి ఆధ్వర్యంలో సమర్పించినందుకు విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నిమ్రా విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైనా నారాయణమూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ జనార్ధన్, వైస్ ప్రిన్సిపల్ మోహన్ కృష్ణ, ఇతర అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం కు జంపాల సత్కారం



**ఇబ్రహీంపట్నం మార్చి 24(వార్తా ప్రభ ప్రతినిధి):-** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య నివాసానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు నెట్టం రఘురాం జంపాల సీతారామయ్య ఇంటికి వచ్చారు. ఆయనను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు జంపాల సీతారామయ్య.సోమవారం నాడు ఇద్దరు నేతలు మర్యాదపూర్వక భేటీ తో కాసేపు ముచ్చటించారు. పార్టీ కార్యక్రమాల,పలు అంశాలపై చర్చించారు. ఎప్పటినుంచో వారి మధ్య ఉన్న బంధాన్ని మరోసారి స్మరించుకున్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



**ఇబ్రహీంపట్నం, మార్చి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఇబ్రహీం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ యూనిట్, జూపూడి నిమ్రా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్, నర్సింగ్ విద్యార్థులతో పీహెచ్ సీ నుంచి ప్రారంభమైన ర్యాలీ రింగ్ సెంటర్ వరకు కొనసాగింది. టీబీ వ్యాధి లక్షణాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిమ్రా మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి టీబీని అంతం చేయాలని ప్రకటించిందన్నారు. ఈ టీబీ బ్యాక్టీరియాను రోబోర్ట్ కోచ్ మార్చ్ - 24 కనుగొన్నారన్నారు. ఇది గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందని చెప్పారు. ఈ వ్యాధి సోకిన వారికి దగ్గు, జ్వరంతో పాటు బరువు తగ్గడంతో పాటు ఇతర లక్షణాలు ఉంటాయన్నారు. టీబీ రోగులకు ప్రభుత్వ వైద్యంతో పాటు నిక్ష్య పోషణ యోజన ద్వారా నెలకు రూ.1000 మందులు మింగినంత కాలం బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. టీబీ రోగులు భయపడాల్సిన అవసరం లేదని, క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని నిర్మూలించవచ్చన్నారు. అనంతరం పది మంది టీబీ రోగులకు నిమ్రా యాజమాన్యం పోషకాహారం అందజేసింది. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్, నిమ్రా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేశ్వరి, డాక్టర్ సుమంత్, పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రోహిత్, టీబీ యూనిట్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా గయాసుద్దీన్ (ఐజా) ఆధ్వర్యంలో వేలాదిమందికి ఇఫ్తార్ విందు

### కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్





**విజయవాడ పశ్చిమ మార్చి 24: (వార్తా ప్రభ ప్రతినిధి)**పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ ఐజా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వేలాది మందికి ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. భవానిపురం లోని మసీద్ ఏ రాజా వీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది ముస్లిం సోదరులు రంజాన్ ఇఫ్తార్ విందులో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా జలీల్ ఖాన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఐజా వేలాది మంది ముస్లిం సోదర సోదరీమణులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఐజాకు అండదండగా, తోడుగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గయాసుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ సందర్భంగా వేలాదిమంది ముస్లిం సోదర సోదరీమణులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇఫ్తార్ విందులో హిందూ, క్రిస్టియన్ సోదరులు కూడా పాల్గొనడం మతసామరస్యానికి నిదర్శనమని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తోటి వారికి సహాయం చేయడం పుణ్యకార్యమని ఆయన అన్నారు. ఇఫ్తార్ విందుకు హాజరైన జలీల్ ఖాన్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొని ఇఫ్తార్ విందును పర్యవేక్షించారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి





**విజయవాడ పశ్చిమ మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక 34వ డివిజన్ గౌసియా మస్జీద్ వద్ద వైసిపి నాయకులు షేక్ మెహబూబ్ (మాబు) ఆధ్వర్యంలో సోమవారం నాడు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లిం సోదరులు, వైసిపి నాయకులతో కలిసి మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుని వడ్డించారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్, ఏ పి ఐ డి సి మాజీ చైర్మన్ బండి పుణ్యశీల, వైసిపి నాయకులు బండి రాజ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పించాలి

### - సిపియం నిరసన



**ఇబ్రహీంపట్నం, మార్చి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొండపల్లి - ఇలబ్రోలు రోడ్డులో గల జగనన్న కాలనీ లో రోడ్లు , మంచినీరు, డ్రైనేజీ , హాస్పిటల్, బస్ స్టాఫ్ లాంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎస్ సి హెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో డి ఎం ఎఫ్ టి నిధుల ద్వారా కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌళిక సదుపాయాల కల్పన కు స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి యం మహేష్ కోరారు. ముఖ్యంగా మంచినీరు, డ్రైనేజీ , రోడ్లు , లైబ్రరీ , అంగన్వాడి స్కూల్స్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యంగా కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఈలప్రోలు కొండపల్లి రోడ్ లో గల జగనన్న కాలనీలో రోడ్లు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, నేతాజీ నగర్ బోరు పంపు రిపేరు చేయాలని, మెరక ప్రాంతాలకు మంచినీరు సరఫరా పుట్లమ్మ గట్టు నేతాజీ నగర్ కొత్త గేటు ఒడియా క్యాంపు , దిగువ ప్రాంతం అరుణ నగర్ ఆదర్శనగర్ లలో మంచినీరు రెగ్యులర్గా అందించాలని, కాజీమాన్యం డ్రైనేజ్ తక్షణమే నిర్మించాలని మోహన్ రావు నగర్ ప్రాంతంలో మంచినీళ్లు ఉదయం పూట అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ కమిటీ సభ్యులు ఎల్ పార్వతి, సిపిఎం నాయకులు నాయకులు పాటల శ్రీను, శివ కోటేశ్వరరావు, రమణమ్మ, ఎస్ ఎఫ్ ఐ నాయకులు కుశల్ కుమార్, జగనన్న కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బాలల చట్టాలపై అవగాహన



**మైలవరం మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి):**స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం సమావేశపు హాలులో సిడిపిఓ కె.పుష్పలత అధ్యక్షత సోమవారం బాలల చట్టాలపై అవగాహన, సామర్థ్యం పెంపుదల మరియు కెపాసిటీ బిల్డింగ్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సు కు ముఖ్య అతిథిగా ఎంపిపి ఇస్లావతు ప్రసన్న రాణి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల్లో కెపాసిటీ బిల్డింగ్(నేర్చుకునే సామర్థ్యం) గురించి వివరించారు. అడ్వాకెట్ పి. పద్మ శ్రీ జెజె యాక్ట్, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. వి.దుర్గారావు(ఐ సి పి ఎస్) బాలలకు ఎలాంటి చట్టాలు ఉన్నాయి,అవి వారికి ఏవిధంగా ఉపయోగపడతాయో వివరించారు. సి హెచ్ దివ్యశ్రీ (ప్రోగ్రాం అసోసియేట్) మహిళల రక్తహీనత పౌష్టికాహారం గురించి వివరించారు. మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ దాడి చంద్రశేఖర్ పోక్సో, శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. సి హెచ్ రాహేళమ్మ పిసిఎంఎ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ లో సూపర్వైజర్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు,వి ఒ ఏ లు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలిపట్నం మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వేసవి దృష్ట్యా కోనేరు సెంటర్లో మచిలీపట్నం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన నగరపాలక సంస్థ అధికారులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## ఆటో బోల్తా ఒకరు మృతి పలువురికి గాయాల్ళ



మచిలిపట్నం **మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం మంగినపూడి బీచ్ ప్రాంతంలో ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి, పలువురికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాలు ప్రకారం మచిలీపట్నం గుమస్తాల కాలనీకి చెందిన మర్రి గట్ల సంతోష్ తన స్నేహితులతో సోమవారం మంగినపూడి బీచ్ కు సముద్ర స్నానానికి వెళ్లారు. సముద్ర స్నానాలు అనంతరం తన స్నేహితులతో ఆటోలో తిరుగు ప్రయాణం లో వస్తూ ఉండగా మార్గం మధ్యలో ఆటోకు ప్రమాదం సంభవించి బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ అభిషేక్ (25)అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన అభిషేక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మచిలీపట్నం రూరల్ పోలీసులు.

## ప్రజావాణిలో ఫిర్యాదు



**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జూలూరుపాడు, మండల పరిధిలోని గుట్టలను తవ్వి మట్టిని అమ్ముకొని కొందరు అక్రమార్కులు గుట్టలను కరిగిస్తూ అక్రమంగా జేబులు నింపుకుంటున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన హ్యూమన్ రైట్స్ సొసైటీ బహుజన అభ్యుదయ సేవా సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తంబర్ల నరసింహారావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మిషన్ ఉంది అంటూ పకృతిని నాశనం చేస్తూ ముందుకు వెళుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలో ఉన్నటువంటి గుట్టలను కాపాడాలని అన్నారు వెంటనే అధికారులు స్పందించి త్వరలోనే నిజ నిజాలను బయటకు తీస్తామని సమంత అదే అధికారులకు ఆదేశాలు ఇస్తామని అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు

## సీఎం సహాయ నిధి పేదలకు భరోసా

### టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్



**విజయవాడ పశ్చిమ మార్చి 24(వార్తా ప్రభ ప్రతినిధి )**ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు భరోసా కల్పిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ అన్నారు. చిట్టినగర్ కు చెందిన అబ్దుల్ వసీం గుండెపోటు కు గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆర్థిక ఇబ్బందుల వలన సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా రూ 1,19,561 మంజూరయ్యాయి. ఆ చెక్కును సోమవారం బాధితునికి అందజేశారు. వించిపేటలోని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ లతో కలిసి అందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా చేస్తుందని ఎమ్ ఎస్ బేగ్ అన్నారు. ప్రత్యేక చొరవతో త్వరితగతిన చెక్కు మంజూరుకు సాయం చేసిన ఎమ్మెల్యే సుజనాకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

## సంపూర్ణ ఆరోగ్యమే కొండంత ఆస్తి

● ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్



**విస్సన్నపేట,మార్చి 24 (వార్తాప్రభ) :** మనం దైనందిక జీవితంలో మన అలవాట్లు మన నడవడిక మన ఆరోగ్యానికి మహాసముద్రంలో దిక్సూచి వలె దారి చూపుతాయని ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్ తెలియజేశారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం మనం జరుపుకుంటున్నామని భయంకరమైన అంటువ్యాధి అయిన టీవీ( క్షయ) దేశవ్యాప్తంగా రోజుకు వెయ్యి మంది మరణిస్తున్నట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించటం సోషల్ మీడియాలో చూశానని భారత ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలను 1962 సంవత్సరం నుండి తీసుకోవడం జరుగుతుందని 1882 మార్చి 24న డాక్టర్ రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మ క్రిములను మొదటి సారి కనుకున్నారని 1982 సంవత్సరంలో అంతర్జాతీయ క్షయ ఊపిరి తిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మ క్రిములను కనుగొని వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మార్చి 24 ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం జరుపుకో వాలని ప్రతిపాదించడం జరిగిందని ఇది అందరికి తెలిసిందే అన్నారు.

## వీ.కే.ఆర్ & వీ.యన్.బి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాల..




**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** సోమవారం గుడివాడ వీ.కే.ఆర్ అండ్ వీ.యన్.బి ఇంజినీరింగ్ కళాశాలలో "కళాశాల ఐ.ఈ.టి.ఈ చాప్టర్" మరియు విజయవాడ కు చెందిన "మైక్రో లింక్ పెరిఫరల్ కంట్రోల్స్ ప్రై లిమిటెడ్" సంయుక్త ఆధ్వర్యంలో "ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ డిజైన్ అండ్ ఇట్స్ డవలప్మెంట్" పై బి.టెక్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి కార్యశాలను రిసోర్స్ పర్సన్ మరియు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మైక్రో లింక్ పెరిఫెరల్ కంట్రోల్స్ ప్రై లిమిటెడ్ సీనియర్ ఇంజినీర్ వి. గోవిందరావు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు డిజైన్ పై అవగాహన ఎంతో అవసరమన్నారు.. ఇందుకు ఎలక్ట్రానిక్ కంపోజిటివ్ ట్రాక్స్, అత్యంత కీలకమైన సర్క్యూట్ బోర్డ్ డిజైనింగ్ లను ఈ రెండు రోజుల కార్యశాలలో విద్యార్థులకు నేర్పిస్తారన్నారు. కార్యశాల ప్రారంభోత్సవ సభలో కళాశాల సెక్రటరి మరియు కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి.ప్రసాద రావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎమ్.నాగు, ఇన్స్టిట్యూట్ విభాగాధిపతి గొరిపర్తి మురలీకృష్ణ, ఐ.ఈ.టి.ఈ చాప్టర్ సమన్వయకర్త గుత్తా రాజేంద్ర, సీనియర్ ఫాకల్టీ ఎమ్.దేవికి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలిండియా ఖో ఖో పోటీలలో ప్రతిభ కనబర్చిన ఆం.ప్ర. పురుషుల టీం




**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** ఈనెల 21 నుండి 24వ తేది వరకు ఢిల్లీలో వినయ్ మార్గ్ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఖో ఖో టోర్నమెంట్ లో ఆంధ్రప్రదేశ్ పురుషుల టీం బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగింది. టీం కోచ్ & మేనేజర్ గా మడక ప్రసాద్ గారు వ్యవహరించారు. టీం సభ్యుడు మడక ప్రసాద్ గారి శిష్యుడు జాతీయ క్రీడాకారుడు ధనాల రాజ్ కుమార్ అత్యంత ఆట తీరును కనబరిచి ఈ విజయంలో కీలక పాత్ర వహించాడు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆంధ్ర ప్రదేశ్ ఖో ఖో సంఘం కార్యదర్శి మేకల సీతారాం రెడ్డి, కృష్ణా జిల్లా ఖో ఖో సంఘం కార్యదర్శి ఎం సత్య ప్రసాద్, నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామి రెడ్డి, సచివాలయ సహోద్యోగులు తదితరులు అభినందించారు.

## క్షయ వ్యాధి రహిత గ్రామంగా చిన నందిగామ

● కలెక్టర్ డా.జి.లక్ష్మీశ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్న సర్పంచ్ ధనేకుల శ్రీకాంత్



**జి.కొండూరు,మార్చి 24 (వార్తాప్రభ) :** ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ సంస్థ ఆధ్వర్యంలో టిబి ముక్తి పంథకం ద్వారా జిల్లాలో క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా గుర్తించిన గ్రామ పంచాయతీలలో జి.కొండూరు మండలంలోని చిన నందిగామ గ్రామ పంచాయితీ ఎంపికయ్యింది.ఈ గ్రామ పంచాయితీ ని క్షయ వ్యాధి లేని గ్రామంగా గుర్తించిన ఆ సంస్థ అవార్డు ప్రకటించింది.విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ చేతులు మీదుగా చిన నందిగామ గ్రామ సర్పంచ్ ధనేకుల శ్రీకాంత్, ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వరరావు తో కలిసి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.కార్యక్రమంలో డిఆర్వో యం. లక్ష్మీనరసింహం, జిల్లా క్షయ నివారణ అధికారి డా.జె. ఉషారాణి, డియం అండ్ హెచ్వో డా.యం. సుహాసిని, డియంవో డా. మోతిబాబు, డిప్యూటి ఆర్యంవో డా.శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో ఇంటింటికి త్రాగునీరు : ఎమ్మెల్యే రాము

● శ్రీకాళహస్తి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే రాము.. నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన ప్రజలు..



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** శ్రీకాళహస్తి కాలనీ ప్రజల రెండు దశాబ్దాల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ.. నెల రోజుల్లో ఇంటింటికి త్రాగునీరు అందించే బాధ్యత నాదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం శ్రీకాళహస్తి కాలనీలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే రాము పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు త్రాగునీటి సమస్యను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్య విధానాలతో పైప్లైన్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని.. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటినుండి పాడైన చోట్ల పైపులైన్లకు పరమ్మత్తుల పనులను ముమ్మరంగా చేస్తున్నామని ఎమ్మెల్యే రాము ప్రజలకు తెలిపారు. ప్రస్తుతం పైప్లైన్ల లో నీటి సరఫరా ట్రయల్స్ జరుగుతున్నాయని, మరో నెల రోజుల్లో ప్రతి ఇంటికి వ్యక్తిగత త్రాగునీటి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ మొదలవుతుందని ఎమ్మెల్యే రాము చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్ ను గాడిలో పెడుతున్నామని, రానున్న రోజుల్లో ప్రజలకు నీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ పర్యటనలో ఎండిఓ విష్ణు ప్రసాద్, రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ, ఆర్.ఐ. నాగబాబు, టిడిపి నాయకులు సమ్మెట బ్రహ్మాజీ, పంద్రాజు సాంబయ్య, ఉంగరాల మురళీ, వడ్లాని పిచ్చయ్య, దుడ్డు రవి, మండల పరిషత్ మరియు రెవిన్యూ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్.. ఎమ్మెల్యే రాము

● నియోజకవర్గ పరిధిలోని 28 బాధిత కుటుంబాలకు.. రూ.18 లక్షల 89 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ● ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు..



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** సీఎం రిలీఫ్ ఫండ్ నిధి.. కష్టాల్లో ఉన్న పేదలకు పెన్నిధి వంటిదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో.. నియోజకవర్గ పరిధిలోని 28 బాధిత కుటుంబాలకు, 18 లక్షల, 89 వేల, 810 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రాము సోమవారం ఉదయం అందచేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే రాము మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అన్నారు. జగన్ ఆర్థిక అరాచకాలు సృష్టించి, అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని విమర్శించారు. కష్టమైన అభివృద్ధి, సంక్షేమం దిశగా చంద్రబాబు పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, సీనియా టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరి జగన్మోహన్రావు, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు రెడ్డి అప్పారావు, సాంబయ్య, కొడాలి రాజా, పొట్లూరి రవి, అంజిరెడ్డి, వసంతవాడ దుర్గారావు, సింగవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ అభివృద్ధికి ఆర్.ఎస్. సేవలు చిరస్మరణీయం - వెనిగండ్ల రాము



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** రాజకీయ పితామహుడు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రి చౌదరి (ఆర్.ఎస్)కి గుడివాడ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో స్వర్గీయ రావి శోభనాద్రి చౌదరి జయంతి వేడుకలను సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి చిత్రపటానికి ఎమ్మెల్యే రాము.. కూటమి నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటినుండి అన్న ఎన్టీఆర్ కు సన్నిహితంగా ఉన్న రావి శోభనాద్రి చౌదరి.. ఆయన బాటలో నడుస్తూ గుడివాడ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా గుడివాడలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, సెంట్రల్ లైటింగ్, పశువుల హాస్పిటల్ నిర్మాణం, అర్బన్ బ్యాంక్ అభివృద్ధి ఇలా గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి రావి శోభనాద్రి చౌదరి చేసిన సేవలు ఎన్న లేనివని ఎమ్మెల్యే రాము కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరి జగన్మోహన్రావు, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, టిడిపి నాయకులు రెడ్డి అప్పారావు, పంద్రాజు సాంబయ్య, కొడాలి రాజా, పొట్లూరి రవి, అంజిరెడ్డి, వసంతవాడ దుర్గారావు, సింగవరపు ప్రభాకర్, రెడ్డి షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అవసరాల గుర్తింపునకే పి 4 సర్వే

● టి.డి.పి. నేత గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం,మార్చి 24 (వార్తాప్రభ) :** స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది అని,పబ్లిక్, ప్రైవేటు , పీపుల్ పార్టిసిపేషన్ -పి 4 పేరుతో నిర్వహిస్తున్న సర్వే కేవలం పేదవారి అవసరాలను స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధానంతో, సంక్షేమం ఆగిపోతుందేమోనన్న అపోహలు వద్దు అని కృష్ణజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు,మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ గోపు సత్యనారాయణ అన్నారు.. పి 4 సర్వే ద్వారా 20 శాతం పేదవారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి వారికి చేయూత నిస్తామని తెలిపారు.సామాజిక సమ్మిళిత అభివద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన పది సూత్రాల్లో మొదటిదైన పేదరిక రహిత సమాజం సాధించడానికి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా, దీపం, ఎన్టీఆర్ వైద్య సేవ లాంటి ప్రభుత్వ పథకాలతో పాటు సమాజంలో ఉన్న సంపన్న వర్గాలు, ప్రవాస ఆంధ్రుల సహాయ సహకారాలతో సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను పేదరిక విషవలయాల నుండి అధిగమించడానికి పి-4 ప్రారంభించడం జరిగిందని సత్యనారాయణ అన్నారు.అట్టడుగు స్థాయి కుటుంబాలను పేదరికం నుండి పైకి తీసుకురావటం ద్వారా ఆరోగ్య, సంపన్న, సంతోష ఆంధ్రప్రదేశ్ సాధించడం. సంపన్నుల్లో 10 శాతం కుటుంబాల నుండి అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా వారి దీర్ఘకాలిక ఆర్థిక అభివద్ధిని సాధించడం. సమాజంలో చాలామంది దాతలు ఉన్నప్పటికీ ఒక ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్ లేకపోవడంవల్ల ఎవరికి చేయూతనివ్వాలో తెలియక వారి సహాయాన్ని పొందలేని పరిస్థితి ఉందని, ప్రభుత్వం సహాయం కోరుకునే కుటుంబాలను గుర్తించడం ద్వారా సహాయం చేయాలి అనుకునే వారికి సరైనటువంటి సమాచారాన్ని ఇవ్వడం తద్వారా అభివద్ధిని సాధించడానికి పి4 సర్వే ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్ , సెక్రెటరీ వెంకటేశ్వర రావు , బొమ్మిడి ఏడుకొండలు , జొన్నల వెంకటేశ్వర రావు , సచివాలయ సిబ్బంది ,ఏ ఎన్ ఎమ్,ఆశా వర్కర్స్,వెలుగు బుక్ కీపర్లు, అంగన్వాడీ టీచర్స్ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన ఆప్స్ వ్యవస్థాపకులు కొల్లూరి చిన్నా



**పెడన,మార్చి 24 (వార్తాప్రభ) :** పట్టణ ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము ముందు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి ప్రారంభమవుతుందని ఈరోజు మజ్జిగ దాతలు తుమ్మలపల్లి వంశీ వర్ధన్ ప్రేమాన్విత దంపతులని తెలియజేశారు. మరి కొంతమంది దాతల సహకారంతో గత తొమ్మిది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. వర్షాలు పడే వరకు నిర్వహించే మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి లక్ష రూపాయలు వరకు ఖర్చు అవుతుందని తెలియజేస్తూ ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు డా. కొల్లూరి. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కే టీ మురళీకృష్ణ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు కార్యవర్గ సభ్యులు మాతా సాయి సభ్యులు జల్లూరి రంగారావు ఉదయగిరి గోపాల్ కొల్లూరి భాస్కర్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ సభ్యులు బొలిశెట్టి విమల సమయమంత్రి యామిని శ్రీ వాసవి మహిళా మండలి సభ్యురాలు కొమ్మూరి సారిక కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం 11 సూత్రాల కమిటీ వైస్ చైర్మన్ జల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరు మున్సిపల్ చైర్ పర్సన్ రాజీనామా



**విస్సన్నపేట,మార్చి 24 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ చైర్ పర్సన్ గతం కస్తూరి బాయి తమ రాజీనామా లేఖ ను తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ కు అందించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

## నీటిని పొదుపు చేయాలంటూ ప్రదర్శన..



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా తారక రామ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మెరుగు మాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నీటి పొదుపు గురించి ప్లకార్డ్స్‌తో ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమమునకు హాజరైన ప్రముఖులు సిహెచ్ గంగాధరరావు, సిహెచ్ సత్యనారాయణ, టి రామ్మోహన్ రావు, వి శైలజ, రామకృష్ణ, సిహెచ్ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ పి నాంచారయ్య తదితరులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు సభ్యులు అందరికి ధన్యవాదములు కార్యదర్శి బి రాధాకృష్ణ తెలియజేసారు.

## పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి..

-అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గాయత్రి




**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** సోమవారం శ్రీ శేషాద్రిరావు, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ నందు పోక్సో యాక్టు మీద విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పి. గాయత్రి గారు పాల్గొని పోక్సో యాక్టు మీద విద్యార్థులకు అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ గాయత్రి గారు మాట్లాడుతూ విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు మరియు అనవసర స్పర్శలు, సైగలు మొదలగు అంశాల మీద పిల్లలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. చిన్న పిల్లలపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిని స్నేహితులులాగా ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్, గుడ్లవల్లేరు తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల వారికి మరింత చేయూత : పీ4 సర్వే



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పీ4) సర్వేపై స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు 11వ వార్డు సచివాలయంలో పీ4 సర్వేపై వార్డు సభను నిర్వహించారు. ముందుగా రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన పీ4 పోస్టరును వార్డు అధ్యక్షుడు సయ్యద్ జబిన్, తెలుగుదేశం నాయకులు పట్టపు చిన్న, సయ్యద్ గఫార్, షేక్ కరీముల్లా, సయ్యద్ మొబీన్ లు మరియు సచివాలయ అడ్మిన్ కైకాల చంద్రశేఖర్ లు అవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పక్కా ఇళ్లు, విద్యుత్, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ కనెక్షన్ వంటివి లేకుండా ఇంకా ఎటువంటి సంపాదన లేనివారిని గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే సర్వే ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

## నేటి యువతకు ఆదర్శం 'భగత్‌సింగ్ త్యాగం'



**గుడివాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** స్థానిక సిపిఎం కార్యాలయంలో స్వతంత్ర సమరయోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు 94వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. యువత భగత్‌సింగ్ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని దేశ ఉన్నతికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.సి.పి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి లక్ష్మణరావు, టైలరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు లాజర్, నవభారత్ కాదు స్టోర్ అధినేత గఫార్, నాయకులు రేపాని కొండ, ఎల్. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నాగెలుపు కోసం పోరాడిన వారందరికీ రుణపడి వుంటా

● టీడీపీ విస్తృత సమావేశంలో ఎమ్ ఎల్ ఏ కాగిత



**పెడన,మార్చి 24 (వార్తాప్రభ) :** స్థానిక తెలుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులను నాయకులకు యూనిట్ ఇంచార్జ్ లకు బూత్ ఇంచార్జ్ లకు నియోజవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పంపిణీ చేసారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నా గెలుపు కోసం పోరాడిన నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటాను. ప్రపంచంలోనే మొట్ట మొదటి సారిగా పార్టీ సభ్యత్వాన్ని ప్రవేశ పెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు నారా లోకేష్ ఆలోచనతో కార్యకర్తలకు భరోసా కల్పించాలని సభ్యత్వం పొందిన కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించాం అని అన్నారు పేద కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించి,కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కార్యకర్త పార్టీ అధినాయకత్వం భావిస్తోందని అన్నారు. నియోజకవర్గంలో అన్ని బూత్ లలో కుటుంబ సాధికార కమిటీ లను ఏర్పాటు చేసుకుని ప్రజలకు పార్టీకి వారధిగా పని చెయ్యాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందించే విషయంలో రాజీ లేకుండా అర్హులైన లబ్ధిదారులకు అందిస్తాం అని అన్నారు పార్టీ ఆదేశానుసారం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తాం అలాగే వారంలో రెండు గ్రామాలు పర్యటించి ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలోబొడ్డు వేణుగోపాల్ రావు అర్జా నగేష్ శలపాటి ప్రసాద్ శీరం ప్రసాద్ యక్కల శ్యామలయ్య వివిధ హోదాల్లో వున్న నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ పంచాయితీ కార్యాలయం, పోలవరం
## టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.2/2025 తేది. 22.03.2025.

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, పోలవరం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.25.03.2025 వ తేది మంగళవారం ఉదయం గం.10.00 ని.ల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు ఉదయం గం.11.00 ని.లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 2) | ట్యాంక్ ఆపరేటర్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 3) | కంప్యూటరు ఆపరేటరు గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 4) | స్వీపర్‌గా పనిచేయుటకు ఐదుగురు వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీ నక్కిన వెంకట నాగరాజు, సర్పంచ్, పోలవరం గ్రామ పంచాయితీ
సం/- డి.పాండురంగారావు, కార్యదర్శి, పోలవరం గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం, గోకవరం
## టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. /2025 తేది. 24.03.2025.

కృష్ణాజిల్లా, బందరు మండలం, గోకవరం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2025 నుండి 31.03.2026 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.26.03.2025 వ తేది ఉదయం 10.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు ఉదయం 11.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తీ సేవలు | 01.04.2025 నుండి | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- ఎండి మీరా, కార్యదర్శి, గోకవరం గ్రామ పంచాయితీ
సం/- శ్రీమతి బక్కా రాజేశ్వరి, సర్పంచ్, గోకవరం గ్రామ పంచాయితీ

## గ్రామ పంచాయితీ కార్యాలయం, పినగూడూరులంక
## టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.2/2025 తేది. 22.03.2025.

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, పినగూడూరులంక గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.25.03.2025 వ తేది మంగళవారం మధ్యాహ్నం గం.12.00 ని.ల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.00 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |
| 2) | స్వీపర్‌గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

సం/- శ్రీమతి రాహేతున్నిస, సర్పంచ్, పినగూడూరులంక గ్రామ పంచాయితీ
సం/- డి.పాండురంగారావు, కార్యదర్శి, పోలవరం గ్రామ పంచాయితీ

# అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి...

- అధికారులు అర్జీదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలి...
- జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు 133 ఆర్జీలు నమోదు..
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ.



**విజయవాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా (పిజిఆర్ఎస్) అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ ప్రజల నుండి 133 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో నమోదవుతున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పెండిరగ్ ఉండరాదన్నారు. అర్జీదారుల సమస్యను అధికారులు ఓపిగ్గా విని పరిష్కార మార్గాన్ని తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. అర్హతను పరిశించాలని, అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారునికి వివరించాలన్నారు. పరిష్కారమైన అర్జీదారులతో ఐవీఆర్ఎస్ ద్వారా ఉన్నతాధికారులు వారి సంతృప్తి స్థాయిని తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అవసరమైతే సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి పరిష్కారం ఉండాలన్నారు. గడువులోగా పరిష్కరించాల్సిన అర్జీలపై అధికారులు దృష్టి పెట్టాలని, గడువు తీరిన అర్జీలు ఏ శాఖలోనూ పెండిరగ్ ఉండరాదని కలెక్టర్ అన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిజిఆర్ఎస్ దరఖాస్తులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రజల నుంచి 133 ఆర్జీలు రాగా రెవెన్యూ శాఖకు సంబంధించి 41, పోలీస్ 21, యంఎయుడి 17, పంచాయతీరాజ్ 11, డిఆర్‌డిఏ 5, ఉపాధి కల్పన 5, సర్వే 5, సహకార సంఘం 4, పౌరసరఫరాలు 3, హెల్త్ 3, ఏపిసిపిడిసిఎల్ 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 2, పశుసంవర్ధక శాఖ 2, వ్యవసాయం 2, వాణిజ్య పనులు 1, ఆర్‌డబ్ల్యుఎస్ 1, ఇరిగేషన్ 1, నైపుణ్య అభివృద్ధి 1, మార్కెటింగ్ 1, బిసి కార్పొరేషన్ 1, మత్స్య 1, విద్యా 2. ఖజాన 1 విభాగాలకు ఆర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ యం. లక్ష్మీనరసింహ, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జి. జ్యోతి, ఏసిపి కె వెంకటేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హెూంమంత్రి వంగలపూడి అనిత కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మూల్పూరి సాయి కళ్యాణి



**హనుమాన్ జంక్షన్,మార్చి 24 (వార్తాప్రభ) :** రాష్ట్ర హెూంశాఖ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత కి తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా, పాయకరావుపేటలోని అనిత నివాసానికి సోమవారం సాయి కళ్యాణి మర్యాదపూర్వకంగా విచ్చేసి ప్రత్యేకంగా చేయించిన అనిత చిత్రపటాన్ని అందజేశారు. విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చి, ఎమ్మెల్యేగా, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా, తెలుగు మహిళ విభాగానికి రాష్ట్ర అధ్యక్షురాలిగా, ప్రస్తుతం రాష్ట్ర హెూంమంత్రిగా తన ప్రత్యేకతను చాటుకుంటున్న అనిత కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. అనిత సంపూర్ణ ఆయురారోగ్య, ఆనందాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నానని సాయి కళ్యాణి ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కృష్ణా జిల్లా తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి దివి యుగంధరి, తెలుగు మహిళ నేతలు దివి యశస్విని, సుజాత, ఉన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన శక్తీ యాప్ ప్రాముఖ్యత పై ప్రత్యేక సమావేశం



**ఆగిరిపల్లి, మార్చి 24 (వార్తాప్రభ) :** నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ ఆదేశాల మేరకు నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ నేతృత్వంలో మరియు ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, గ్రామ మహిళా సంరక్షణ కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సమావేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణ మార్గాలు, శక్తీ యాప్ ఇన్‌స్టాలేషన్ ప్రాముఖ్యత, సైబర్ క్రైమ్ ముప్పులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, కుటుంబ సభ్యులతో తక్షణమే సంబంధం కలిగి, రక్షణ పొందే విధానంపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ హ్యారాస్మెంట్‌కు గురైన మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మహిళల భద్రతలో సమాజం అంతా భాగస్వామ్యం కావాలని, అనుమానాస్పద వ్యక్తులు, సంఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలనే సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా పోలీసులు, జి.ఎం.ఎస్.కె. సభ్యులు, గ్రామస్థులు పోలీసు అధికారుల సూచనలు పాటించి మహిళా భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉండాలని తెలియ చేసారు.

# కలెక్టరేట్ గ్రీవెన్స్ వద్ద వర్మీ కంపోస్ట్ స్టాల్ ఏర్పాటు

- మైలవరం మండలం,చంద్రాల గ్రామపంచాయతీ ద్వారా 90 కిలోల వర్మీ కంపోస్ట్ అమ్మకం





**మైలవరం,మార్చి 24 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం, చంద్రాల గ్రామపంచాయతీ కి చెందిన ఎస్ డబ్ల్యు పిసి లో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువు నుంచి 90 కిలోల ఎరువును అమ్మినట్లు ఆ గ్రామ పంచాయితీ సెక్రటరీ వి.దుర్గా ప్రసాదరావు తెలిపారు.కలెక్టరేట్ గ్రీవెన్స్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ స్టాల్ వద్ద ఎరువు అమ్మకాలు ప్రారంభించినట్లు వెల్లడించారు.వర్మీ కంపోస్ట్ స్టాల్ ను జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి పరిశీలించ్చారని, మైలవరం ఈవొపిఆర్ అండ్ ఆర్ డి, మరియు డిపిఆర్ సి ఎఫ్ టి సి ల పర్యవేక్షణలో ఎరువు అమ్మకపు ప్రక్రియ కొనసాగిందని,చంద్రల గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారని తెలియజేశారు.

# వైన్ షాపు ఏర్పాటు పై సిపిఎం ఫిర్యాదు






**విస్సన్నపేట,మార్చి 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో విద్యాసంస్థల దగ్గరలో వైన్ షాపు ఏర్పాటు విషయమై తిరువూరు ఎక్సైజ్ అధికారులను విస్సన్నపేట సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . అనంతరం విస్సన్నపేట మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి కి మరో వినతిపత్రం అందించినట్లు వారు చెప్పారు .ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు వినుకొండ రంగారాణి ,సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, సిపిఎం విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ సూర్యదేవర కేశవరావుబాబు



**అమరావతి,మార్చి 24 (వార్తాప్రభ) :** వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ సూర్యదేవర కేశవరావు బాబు ప్రతిష్టాత్మకమైన పదవికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ కేశవరావుబాబు.. మధుమేహ చికిత్సా నిపుణులుగా విశిష్ట ఖ్యాతి గడించారు. మధుమేహం, రక్తపోటుకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలుగు భాషలో పలు రచనలు చేసి, వైద్య పరిశోధనల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఓడీఏ ప్రాజెక్టు వైద్యాధికారిగా, వీఎంసీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసరుగా, వీఎంసీ స్కూల్ హెల్త్ ప్రాజెక్ట్ హెల్త్ ఆఫీసరుగా సేవలందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ అధ్యక్షుడిగా సమర్థవంతంగా సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. ప్రస్తుతం ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కౌన్సిల్ మెంబరుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా, హాస్పిటల్ బోర్డ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన పలు కార్యక్రమాలకు పరిశీలకుడిగా వ్యవహరించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సలహాదారుడిగా సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. వివిధ అంశాలపై టీవీ, రేడియో మాధ్యమాల్లో అనేక ప్రసంగాలు చేశారు. ప్రధానంగా మధుమేహానికి సంబంధించి అనేక సదస్సుల్లో ప్రసంగించి, అత్యాధునిక చికిత్సలను ప్రజలకు చేరువ చేసేందుకు అద్వితీయమైన కృషి చేశారు. డాక్టర్ కేశవరావుబాబు సేవలను మరింత విస్తృతంగా వినియోహించుకోవాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆయనను ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబరుగా నియమించింది. ఈ నియామకం పట్ల డాక్టర్ కేశవరావుబాబు సంతోషం వ్యక్తం చేశారు. తనకు లభించిన ఈ పదవిని బాధ్యతగా భావించి, అంకితభావంతో సేవలందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ కేశవరావు బాబుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పలువురు వైద్య నిపుణులు శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ నగర ప్రజలకు.. మరీ ముఖ్యంగా వన్ టౌన్ ప్రజలకు విశేష సేవలందించిన డాక్టర్ కేశవరావుబాబు.. ఏపీ మెడికల్ కౌన్సిల్ పదవికి మరింత వన్నె తెస్తారని వారు పేర్కొన్నారు.

# పాము కాటుకు కౌలు రైతు మృతి




**కిర్లంపూడి,మార్చి 24 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన కౌలు రైతు పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడని కిర్లంపూడి పోలీసు స్టేషన్ రైటర్ ఎం వెంకటరమణ తెలిపారు. అనపర్తి కృష్ణ (52) . కౌలుకు చేస్తున్న పొలంలో పనిచేస్తున్న గట్టుపై పడిపోయాడు దీనిని గమనించిన పక్క పొలంలోని రైతులు వచ్చి సపర్యలు చేయగా స్పృహలోకి వచ్చిన కృష్ణ తనను పాము కరిచిందని తెలిపారన్నారు. వెంటనే కుటుంబ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని కుమారుడు దుర్గా ప్రసాద్ తెలిపాడని ఆయన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిర్లంపూడి పోలీసులు తెలిపారు.

# అత్యాధునిక వైద్య సేవలు ప్రజలందరికీ అందుబాటులోకి రావాలి

- ప్రశాంత్ హాస్పిటల్ రెజ్యూమ్.. ప్రోస్టేట్ చికిత్సల్లో గేమ్ చేంజర్
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాష్ట్రంలో తొలిసారిగా ప్రశాంత్ హాస్పిటల్లో విప్లవాత్మక 'రెజ్యూమ్' చికిత్స ఆవిష్కరణ
- ప్రోస్టేట్ సమస్యలకు 'రెజ్యూమ్'తో మెరుగైన ఫలితాలు
- ప్రోస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగం
- ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, ప్రఖ్యాత యూరాలజిస్ట్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్
- రెజ్యూమ్ ఆవిష్కరణకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్





**విజయవాడ,మార్చి 24 (వార్తాప్రభ) :** అత్యాధునిక వైద్య సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్లో, ప్రోస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక చికిత్సా విధానం 'రెజ్యూమ్'ను రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్ లతో కలసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అందుబాటులోకి వచ్చిన ఈ ఆధునిక చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవను మరింత విస్తరించి పేద ప్రజలకు సైతం అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు కార్పొరేట్ ఆసుపత్రుల వారు సహకరించాలని కోరారు. ప్రశాంత్ హాస్పిటల్ ఆవిష్కరించిన 'రెజ్యూమ్' ప్రోస్టేట్ సంబంధిత వ్యాధుల చికిత్సలో గేమ్ చేంజర్ గా నిలుస్తుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, ప్రఖ్యాత యూరాలజిస్ట్ డాక్టర్ కె. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రోస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగంగా ప్రశాంత్ హాస్పిటల్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రోస్టేట్ సంబంధిత సమస్యలన్నింటికీ పరిష్కారంగా విప్లవాత్మకమైన రెజ్యూమ్ వాటర్ థెరపీని అందుబాటులోకి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ చికిత్స యుఎస్ఎఫ్డీఏ ఆమోదితమైన, అత్యంత సరళతరమైన అత్యాధునిక చికిత్స అని తెలిపారు. ఈ రెజ్యూమ్ థెరపీ బీహెచ్పీ చికిత్సల్లో అతి పెద్ద మార్పు తీసుకువస్తుందని చెప్పారు. రెజ్యూమ్ వాటర్ థెరపీలో, పెద్ద శస్త్రచికిత్స అవసరం లేదని, జనరల్ అనస్థీషియా కూడా అవసరం ఉండదని అన్నారు. అతి తక్కువ సమయంలో కోలుకునే అవకాశం ఉంటుందని, సెక్సువల్ ఫంక్షన్‌కి ఎటువంటి హాని ఉండదని చెప్పారు. దీర్ఘకాలిక మందులు వాడాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ థెరపీ ద్వారా నీటి ఆవిరిని ఉపయోగించి ప్రోస్టేట్ గడ్డలను తగ్గించడం ద్వారా, మూత్ర సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ థెరపీ ద్వారా ఇది రోగులకు సురక్షితంగా, వేగంగా, జీవిత నాణ్యతను కాపాడుతూ చికిత్స అందించవచ్చని డాక్టర్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కె. ధీరజ్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ కె. ప్రీతమ్, యూరో గైనకాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పి. హరిత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ అండ్ ఫీటల్ మెడిసిన్ ఎక్స్పర్ట్ డాక్టర్ శ్వేత సీవోవో బి. రమేష్, నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సుభాష్
- పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు,మందులు పంపిణీ



**రామచంద్రపురం, మార్చి 24 (వార్తాప్రభ) :** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో మండపేట నారాయణరెడ్డి పివిఆర్ ఆసుపత్రి సౌజన్యంతో రామచంద్రపురంలోని కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మంత్రి సుభాష్ స్వయంగా బీపీ, ఈసీజీ,2డి ఎకో పరీక్షలు చేయించుకుని ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మాధురి,బుంగ చిట్టిబాబు,మెడికల్ టీంను ప్రత్యేకంగా అభినందించారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని మండపేట నారాయణరెడ్డి ఎం వి ఆర్ హాస్పిటల్ కోరగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారని తెలిపారు.కోవిడ్ మహమ్మారి తర్వాత ప్రజల్లో ఎక్కువ ఆందోళన,మానసిక ఒత్తిళ్లు పెరుగాయన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో బిపి,షుగర్,థైరాయిడ్, గర్భిణీ స్త్రీలకు, గొంతులో కాయలు, ఎముకలు,గుండె సమస్యలు,గ్రీ స్త్రీల సమస్యలుకు సంబంధించి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన పలువురికి గుండెకు సంబంధించిన టు డి ఎకో (రూ. 2500 విలువ చేసే) గుండె స్కానింగ్ ను కూడా ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి మండపేట కెవిఆర్ హాస్పిటల్లో ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని మంత్రి సుభాష్ వెల్లడించారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో రామచంద్రపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య సేవలు,ఉచితంగా మందులు పొందారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్,డాక్టర్ మాధురి,బుంగ చిట్టిబాబు,కె.వి.ఆర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. రామచంద్రపురం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వైద్య బృందాన్ని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188